www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఎట్టకేలకు పట్టుబడిన
సీఎస్‌డీటీ
పుత్తూరు కోర్టులో విష్ణును హాజరు పరిచిన పోలీసులు 4

స్నేహితుడి కుటుంబంపై ఆటో డ్రైవరు హత్యాయత్నం
● శ్రీకాళహస్తిలో కలకలం

అమానవీయ
రాజకీయం
బాలికపై అత్యాచారం అంటూ నానా యాగీ 4
పరామర్శల పేరుతో హడావుడి
వైసీపీ నేతల తీరుపై జనంలో ఆగ్రహం



బుధవారం | 6-11-2024

Tirupathi | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | తిరుపతి



కొలువుదీరనున్న కొత్త బోర్డు

నేడు టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు, 17 మంది సభ్యుల ప్రమాణ స్వీకారం

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం కొత్త పాలక మండలి కొత్త అధ్యక్షుడు బీఆర్ నాయుడు, 17 మంది సభ్యులు నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో వీరు బాధ్యతలు స్వీకరిస్తారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణ కూడా నేడు ప్రమాణం చేస్తారు. తొలుత చైర్మన్, అనంతరం సభ్యులు ప్రమాణ స్వీకార పత్రాలపై సంతకాలు చేశాక స్వామి దర్శనం చేసుకుంటారు. అనంతరం రంగనాయకుల మండపంలో వీరికి శేషవస్త్రాలు కప్పి వేద ఆశీర్వచనం చేస్తారు. కాగా సాయంత్రం అన్నమయ్య భవనంలో కొత్త పాలక మండలి మీడియా మీట్‌లో పాల్గొంటుంది. ప్రమాణస్వీకారానికి తగిన ఏర్పాట్లను టీటీడీ ఇప్పటికే పూర్తి చేసింది.

ఈ ప్రమాణస్వీకారం కోసం చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం ఉదయం తిరుపతికి చేరుకున్నారు. తన సొంతూరైన పెనుమూరు మండలం దిగువపూనేపల్లికి వెళ్లి పూజలు చేశారు. తిరిగి తిరుమల చేరుకున్నారు. దారి పొడవునా ఆయనకు ఘన స్వాగతం లభించింది.

వీరికి మళ్లీ అవకాశం

తాజా బోర్డులో మరోసారి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేయబోతున్నవారిలో కృష్ణమూర్తి వైద్యనాథన్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, సౌరభ్ బోరా, సుచిత్ర ఎల్లా ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలోనూ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జంగా కృష్ణమూర్తి సభ్యులుగా ఉన్నారు. ఇక, మహారాష్ట్రకు చెందిన సౌరభ్ బోరా చివరి రెండు బోర్డుల్లో సభ్యుడిగా కొనసాగారు. అలాగే భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎండీ సుచిత్ర ఎల్లా గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన బోర్డులో సభ్యురాలిగా ఉన్నారు. ఇక, కేంద్ర హోం మంత్రికి సన్నిహితుడుగా పేరున్న చెన్నైకు చెందిన కృష్ణమూర్తి వైద్యనాథన్ 2015 నుంచి వరుసగా(ఐదుసార్లు) టీటీడీ బోర్డులో కొనసాగుతున్నారు.



బీఆర్ నాయుడికి స్వాగతం పలుకుతున్న విజిలెన్స్, రిసెప్షన్ అధికారులు

వారసులుగా ఇద్దరు

తిరుప్పూర్ బాలుగా పేరున్న బాలసుబ్రహ్మణియన్ పళణిస్వామి గత ప్రభుత్వంలో సభ్యుడిగా ఉన్నారు. అయితే ఈసారి ఆయన సోదరుడు రామ్మూర్తి బోర్డులో అవకాశం దక్కించుకున్నారు. అలాగే గత బోర్డులో సభ్యుడిగా ఉన్న కేతిన్ దేశాయ్ కుమారుడు, కుసుమ్ ధీరజ్‌లాల్ ఆస్పత్రి ఎండీ అదిత్ దేశాయ్ కి ఈసారి అవకాశం లభించింది.

కొత్త బోర్డులో వీరు..

నూతన బోర్డులో టీడీపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు సభ్యులుగా నియమితులయ్యారు. జ్యోతుల నెహ్రూ(జగ్గంపేట), వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి(కోవూరు) ఎంఎస్ రాజు(మడకశిర) స్థానం దక్కించుకున్నారు. మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి తో పాటు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎండీ సుచిత్ర ఎల్లా కూడా కొత్త పాలకమండలిలో ఉన్నారు. రాజమహేంద్రవరం సమీపంలోని రఘుదేవపురానికి చెందిన అక్కిన మునికోటేశ్వరరావు, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్, పల్నాడు జిల్లాకు చెందిన జంగా కృష్ణమూర్తి, కుప్పం క్లస్టర్ ఇన్‌చార్జి వైద్యం శాంతారాం, మంగళగిరికి చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి కూడా సభ్యులుగా నియమితులయ్యారు. ఇక జనసేన నుంచి పవన్‌కల్యాణ్ సన్నిహితుడు, తెలంగాణ జనసేన ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్‌రెడ్డి, సినీ ఆర్ట్ డైరెక్టర్, పవన్‌కల్యాణ్ స్నేహితుడు బూరగాపు ఆనంద్‌సాయి, జనసేన పార్టీ వ్యవస్థాపక సభ్యురాలు అనుగోలు రంగశ్రీకి కొత్త బోర్డులో చోటు లభించింది. అలాగే ఫార్మా రంగంలో ఉన్న నాట్కో గ్రూప్ వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు, ఎస్ఆర్ఐ జాస్తి పూర్ణసాంబశివరావు, కర్ణాటక పారిశ్రామికవేత్తలు నరేష్‌కుమార్, కాఫీ రంగంలో ప్రముఖుడైన ఆర్ఎన్ దర్శన్, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి హెచ్ఎల్ దత్ సభ్యులుగా నియమితులయ్యారు. ఇక, తమిళనాడుకు చెందిన రామ్మూర్తి, ఎంసీఐ చైర్మన్‌గా పనిచేసిన గుజరాత్‌కు చెందిన కేతన్ దేశాయ్ కుమారుడు అదిత్‌దేశాయ్, మహారాష్ట్రకు చెందిన ఆర్థిక నిపుణుడు సౌరభ్ బోరా, కేంద్రమంత్రి అమిత్ షా సన్నిహితుడు కృష్ణమూర్తి వైద్యనాథన్ కూడా సభ్యులుగా స్థానం దక్కించుకున్నారు. స్థానికంగా ఉంటూ శ్రీవారి భక్తుల సమస్యలపై నిరంతరం స్పందించే బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి కూడా నూతన బోర్డులో ఉన్నారు.

వైసీపీలో వివాదాల బోర్డులు

జగన్ ప్రభుత్వంలో టీటీడీ పాలకమండలి నియామకాలు వివాదాలమయం అయ్యాయి. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక వైవీ సుబ్బారెడ్డిని టీటీడీ బోర్డు చైర్మన్‌గా నియమించారు. 2019 జూన్ 22న వైవీ బాధ్యతలు స్వీకరించారు. మూడు నెలల తర్వాత టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అప్పట్లో ప్రభుత్వం 24 మంది సభ్యులు, నలుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులు, ఏడుగురు ప్రత్యేక ఆహ్వానితులతో బోర్డును ఏర్పాటు చేయటంపైనా పలువురు భక్తులు విమర్శలు చేశారు. అందులోనూ ప్రత్యేక ఆహ్వానితులతో కూడా ప్రమాణస్వీకారం చేయించి నూతన పద్ధతికి తెరతీశారు. 2021లో కేంద్ర క్యాబినెట్‌ను తలపించేలా వైసీపీ ప్రభుత్వం జంబో బోర్డును ఏర్పాటు చేయడంపై కూడా తీవ్రస్థాయిలో దుమారం రేగింది. రాజకీయ పునరావాస కేంద్రంగా టీటీడీని మార్చుతూ గత సీఎం జగన్మోహన్‌రెడ్డి 29 మంది సభ్యులు, మరో 52 మంది ప్రత్యేక ఆహ్వానితులతో ఏకంగా 81 మందితో బోర్డును నియమించారు. దీనిపై అప్పట్లో ప్రతిపక్షాలు కోర్టును ఆశ్రయించాయి. కోర్టు ఆదేశాలతో ప్రత్యేక ఆహ్వానితుల నియామకానికి అడ్డుకట్టపడింది. పైగా ఆబోర్డులో ఆరుగురు నేర చరిత్ర కలిగిన వ్యక్తులు సభ్యులుగా ఉన్నారంటూ అప్పట్లో బీజేపీ కోర్టును కూడా ఆశ్రయించింది. అపార్టుమెంట్ల పేరుతో ప్రజలను మోసం చేశారంటూ ఆబోర్డులో సభ్యుడిగా ఉన్న లక్ష్మీనారాయణను అరెస్ట్ కూడా చేశారు. మరోవైపు మూడవ బోర్డుకు భూమన కరుణాకర్‌రెడ్డితో సహా 26 మందిని నియమించారు. ఈ పాలకమండలి నిర్ణయాలన్నీ వివాదాస్పదమే అయ్యాయి. రాజకీయలబ్ధి కోసం టీటీడీ నిధులతో తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణాలు, అవసరం లేకపోయిన విశ్రాంతి గృహాల నిర్మాణం వంటివి విమర్శలకు గురయ్యాయి.

9న శ్రీవారి ఆలయంలో పుష్పయాగం

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 9వ తేదీన పుష్పయాగం శాస్త్రోక్తంగా జరుగనుంది. ఈమేరకు 8వ తేదీన రాత్రి 8 నుంచి 9 గంటల వరకు పుష్పయాగానికి అంకురార్పణ నిర్వహించనున్నారు. ఈసేవ కారణంగా 8న సహస్రదీపాలంకార సేవ, 9న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది. అలాగే తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

తిరుపతి కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు నాణ్యతతో కూడిన వైద్య సేవలను అందించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రుయా, స్విమ్స్ బర్డ్, మెటర్నటీ, అశ్విని ఆసుపత్రుల సూపరింటెండెంట్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చికిత్స అందించాలన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచిత వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా, కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి, సూపరింటెండెంట్లు డాక్టర్ రవిప్రభు, డాక్టర్ రామ్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అశోకవర్దన్, డాక్టర్ పార్థసారథి, డాక్టర్ కుసుమకుమారి, డీఐవో డాక్టర్ శాంతకుమారి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్‌కుమార్, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ మేనేజర్ శివకుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ నూతన బస్సులు ప్రారంభం

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్టీసీ గ్యారేజీ ముందు బుధవారం నూతన ఆర్టీసీ బస్సులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించనున్నారు. దీంతో తిరుపతి- కాణిపాకానికి రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, తిరుపతి-సత్యవేడు మధ్య పల్లెవెలుగు సర్వీసు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ మూడు అద్దె సర్వీసులేనని డిపో మేనేజర్ బాలాజీ తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.14 కోట్లు

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.4.14 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 74,651 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,712 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి

పాకాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాకాలచమండలంలోని చంద్రగిరివారిపల్లె, ఎస్టీ కాలనీ వరదప్పనాయుడుపేట, వల్లివేడు, ఈపాలగుట్టపల్లె గ్రామాల పరిసరాల్లో సోమవారం రాత్రి పంటపొలాలపై ఏనుగులు దాడి చేశాయి. మామిడి, పనస చెట్లు విరిచేశాయి. పైపులైన్లు ధ్వంసం చేశాయి. రాత్రి గ్రామాల నుంచి బయటికి రావాలంటే ఏనుగుల మంద దాడి చేస్తుందేమోనని భయంతో రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. వీటి బారినుండి రక్షించి తమకు పంటనష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

ఘనంగా నాగుల చవితి


అన్నమాచార్య కళామందిరంలో పుట్టవద్ద పూజలు చేస్తున్న మహిళలు

తిరుపతి(కల్చరల్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు తిరుపతిలోని పలు ఆలయాల్లోని మంగళవారం పుట్టలకు పూజలు నిర్వహించారు. కపిలతీర్థం, గాలివీధి కాళికమ్మ గుడి, మంచినీటి గుంట వద్ద శివాలయం వంటి అనేక ప్రాంతాల్లోని నాగదేవతలను మహిళలు ఆరాధించారు. పాము పుట్టలకు మహిళలు దారాలు చుట్టి, పసుపు కుంకుమలు చల్లి, పాలు పోసి భక్తిని చాటుకున్నారు. బియ్యపు పిండి, నేతి దీపాలతో, నువ్వుల చలిమిడి, నానపెట్టిన పెసరపప్పు నైవేద్యాలు పెట్టారు. స్థానిక అన్నమాచార్య కళామందిరంలోని పుట్టవద్ద మహిళలు పెద్దసంఖ్యలో పూజలు చేశారు. కార్యక్రమంలో టీటీడీ విశ్రాంత ఏఈవో ఎన్ శివారెడ్డి, గుండాల గోపినాథ రెడ్డి, జయలక్ష్మి, అపర్ణ, ధనలక్ష్మి, జ్యోతి, ప్రశాంతి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.



చంద్రగిరిలో..

చంద్రగిరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం వైభవంగా నాగుల చవితి వేడుకలను నిర్వహించారు. నాగాలమ్మ ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మూలస్థాన ఎల్లమ్మ ఆలయం, మల్లేశ్వరాలయం, తొండవాడ అగస్త్యేశ్వరాలయంతో పాటు పరిసరాల్లో నాగులమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలేక మహిళలు ఇబ్బంది పడ్డారు.

ప్రధాన రోడ్డుపై మురుగు ప్రవాహం

దుర్వాసనతో వాహనదారుల ఇబ్బందులు



నడిరోడ్లపై డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి పొంగిపొర్లుతున్న మురుగునీరు

తిరుపతి (వైద్యం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఎస్వీ మ్యూజిక్ కళాశాల నుంచి వెస్ట్ చర్చికి వెళ్లే ప్రధాన రహదారిలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో డ్రైనేజీ కాలువలో నుంచి గత రెండు రోజులుగా మురుగు నీరు రోడ్లపైకి పొంగి ప్రవహిస్తుంది. ఈ నీరు రోడ్లపై నుంచి వంతెన కిందకు చేరి చిన్నపాటి మడుగును తలపిస్తుంది. ఈ మార్గంలో వెళ్లే వాహన చోదకులు ఆ మురుగునీటి దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోనే ఉన్న బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు కూడా ఈ దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

అమ్మవారి సేవలో బీఆర్‌నాయుడు

తిరుచానూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని మంగళవారం సాయంత్రం టీటీడీ ఛైర్మన్‌గా నియమితులైన బీఆర్‌నాయుడు దర్శించుకున్నారు. జేఈవో వీరబ్రహ్మం, ఆలయ అర్చకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సూపరింటెండెంట్లు రమేష్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

తప్పులే ఓడించాయని తెలుసుకోండి

● చెవిరెడ్డి వ్యాఖ్యలపై దేవనారాయణరెడ్డి



తిరుపతి (జీవకోన), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీగా గతంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గెలవడానికి తానే ప్రధాన కారణమని టీడీపీ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల వైసీపీ జిల్లా అధ్యక్ష ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మోహిత్ రెడ్డి ఓటమికి కారణమంటూ తనపేరును చెవిరెడ్డి ప్రస్తావించడంపై మండిపడ్డారు. తప్పులు చేశారు కాబట్టే ఓడిపోయారన్నారు. తిరుపతి రూరల్‌లో తమ కుటుంబానికి ఎంతో పట్టు ఉందన్నారు. గడిచిన ఎన్నికల్లో తిరుపతి, రేణిగుంట, రూరల్ ప్రాంతాల్లోనే ప్రచారం చేశానన్నారు. రూరల్‌కు మాత్రమే పరిమితమై చేసి ఉంటే 50వేల మెజారిటీ తెచ్చే శక్తి తమ కుటుంబానికి ఉందన్నారు. పులివర్తి నాని విజయానికి పూర్తి సహాయ సహకారాలు అందించామన్నారు. రాజకీయ ఎదుగుదలకు ప్రధాన పాత్ర పోషించిన తనపై చెవిరెడ్డి నిందలు వేయడం తగదన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మృతిచెందిన మహిళ కుటుంబానికి నష్టపరిహారం అందించాలి

తిరుచానూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో క్రాస్ వీల్ ప్రమాదంలో మృతి చెందిన మహిళ లోకేశ్వరి కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారం అందించాలని, ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్న మహిళకు వైద్యఖర్చులను ప్రభుత్వమే భరించాలని సీపీఎం జిల్లాకమిటీ సభ్యులు ఎస్.జయచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే గాయత్రి వైద్యఖర్చులను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏవోపై చర్యలు తీసుకోవాలని కోరారు.

టీడీఆర్ బాండ్లపై లాబీయింగ్

టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుదేవయాదవ్

తిరుపతి జీవకోన, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుదేవయాదవ్ విమర్శలు గుప్పించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిమ్మినాయుడిపాలెం సమీపంలోని మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించి కమీషన్లు తీసుకుని టీడీఆర్ బాండ్లు ఇచ్చేలా లాబీయింగ్ జరుగుతోందని ఆరోపించారు. ఎవరూ కమిషన్లు ఇవ్వవద్దన్నారు. యజమానులందరికీ వైసీపీ అండగా ఉంటుందన్నారు. లిక్కర్ వ్యాపారాల్లో సైతం చిత్తూరుకు చెందిన అనుచరులను తిరుపతిలో భాగస్వాములను చేశారన్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన ఎమ్మెల్యే అన్ని శాఖల్లో సొమ్ము రాబట్టుకునేందుకు ప్లాన్ చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు బ్రహ్మానందరెడ్డి, మాకం చంద్ర, అమర్నాథరెడ్డి,చింతా రమేష్, హరికృష్ణ యాదవ్‌లు పాల్గొన్నారు.

పేదల నిర్మాణాలపై ప్రతాపం

● అసలైన ఆక్రమణదారులను వదిలేశారంటూ రెవెన్యూ అధికారులపై విమర్శలు


ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల కూల్చివేత

చంద్రగిరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణల పేరిట పేదల ఇళ్లపై రెవెన్యూ అధికారులు ప్రతాపం చూపించారు. మంగళవారం మూడు ఇళ్ళను కూల్చివేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి గల్లా అరుణకుమారి చంద్రగిరి జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గుట్టను చదును చేయించి ఇందిరమ్మ కాలనీ పేరుతో సుమారు 600 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు ఇచ్చారు. కాలక్రమేనా ఈ భూముల విలువ పెరిగింది. గత వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది నాయకులు ఖాళీ స్థలాలను ఆక్రమించుకున్నారు. బేస్ మట్టం వరకు ఇంటి నిర్మాణాలు చేపట్టి స్థలం తమదేనని ప్రకటించుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక చోటా నాయకులు కబ్జాలకు తెర లేపారు. ఇందిరమ్మ కాలనీలో సుమారు వంద ఇళ్ళకుపైగా ఆక్రమణలు జరిగినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు మంగళవారం పేదలు ఆక్రమించుకుని చేపట్టిన మూడు ఇళ్ల నిర్మాణాలను జేసీబీ యంత్రాలతో కూల్చివేశారు. దర్జాగా ఆక్రమించుకుని చేపట్టిన నిర్మాణాలను వదిలేశారంటూ రెవెన్యూ అధికారులపై విమర్శలు వినిపిస్తున్నాయి. తహసీల్దార్ శివరామసుబ్బయ్యను వివరణ కోరగా మూడు ఇళ్ళను కూల్చివేశామన్నారు.. అసలైన అక్రమణలను పరిశీలిస్తామన్నారు.

టీటీడీ చైర్మన్‌కు టీడీపీ నేతల ఘన స్వాగతం


బీఆర్ నాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, సుబ్రమణ్యంనాయుడు

చంద్రగిరి/పాకాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): టీటీడీ చెర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడుకు మండల టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. మంగళవారం రేణిగుంట ఎయిర్ పోర్టులో ఎమ్మెల్యే పులివర్తి నానితో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు. ఆయన స్వగ్రామం పెనుమూరు మండలం దిగువ పూనేపల్లెకు వెళ్తుండగా ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు పూలమాలలు, బొకేలు అందజేసి శాలువాలు కప్పి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, నంగా బాబురెడ్డి, టీజే ప్రవీణ్ తదితరులు ఉన్నారు.


టీటీడీ పాలక మండలి సభ్యుడిగా నియమితులైన నర్సిరెడ్డిని మంగళవారం తిరుపతిలో సన్మానిస్తున్న తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్, ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.శేషాద్రి నాయుడు, నాయకులు హేమంత రాయల్, రంజిత్ నాయుడు తదితరులు

- తిరుపతి విశ్వవిద్యాలయాలు, (ఆంధ్రజ్యోతి)

ఉచితంగా హౌస్ వైరింగ్‌పై శిక్షణ

చంద్రగిరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 11 నుంచి 30 రోజుల పాటు పురుష అభ్యర్థులకు హౌస్ వైరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 9 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుండి తెల్ల రేషన్ కార్డు కలిగిన గ్రామీణ ప్రాంతం వారు అర్హులన్నారు. కనీసం పదోతరగతి చదివి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఫోన్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289, 6301717672 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, తెలంగాణ ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి, తమిళనాడు ఎంపీ రామస్వామి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.

పవన్ వ్యాఖ్యలపై వైసీపీ నేతల తీరు హాస్యాస్పదం

●జనసేన నేత కిరణ్ రాయల్



తిరుపతి, జీవకోన నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో మంచి పాలన అందించాలన్నదే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రధాన ఉద్దేశమని తిరుపతి జనసేన ఇన్‌చార్జ్ కిరణ్ రాయల్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ పిఠాపురంలో పవన్ మాటలపై హోం మంత్రి అనిత స్పందిస్తూ సరిదిద్దుకుంటామన్నారని గుర్తు చేశారు. అయినప్పటికీ వైసీపీ వారు రాజీనామా చేయాలంటూ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కుటుంబంలో సమస్యలు వచ్చినప్పుడు పరిష్కరించుకోవడం సహజమన్నారు. దీనిపై వైసీపీ నేతలు రకరకాలుగా మాట్లాడటమేమిటంటూ ప్రశ్నించారు. కూటమిలో ఎవరు తప్పు చేసినా ప్రశ్నించే హక్కు పవన్‌కు ఉందన్నారు. వైసీపీ పేటియం బ్యాచ్ ఇకనైనా ధోరణి మార్చుకోవాలని హితవు పలికారు. తిరుమలలో అంబటి రాంబాబుచొక్కాకు వైసీపీ స్టిక్కర్ ధరించి దర్శనానికి వెళ్లే టీటీడీ విజిలెన్స్ విభాగం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఈయనపై సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జనసేన నాయకురాలు ఆకేపాటి సుభాషిని మాట్లాడారు. సమావేశంలో కిషోర్, శ్రీనివాసులు, నవీన్, మురళి, సుధీర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాలి నడకన తిరుమలకు భానుప్రకాష్‌రెడ్డి



తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రెండోసారి టీటీడీ పాలక మండలి సభ్యుడిగా నియమితులై 7వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి మంగళవారం అలిపిరి మెట్ల మార్గంలో తిరుమలకు చేరుకున్నారు. ముందుగా అలిపిరి పాదాల మండపంలో, గో మందిరంలో పూజలు నిర్వహించి, గోవింద నామస్మరణలు చేస్తూ తిరుమలకు సాగిపోయారు. అనంతరం తిరుమల చేరుకుని సర్వదర్శనం ద్వారా శ్రీవారిని దర్శించుకున్నారు. తన సేవకు మరోసారి అవకాశం కల్పించినందుకుగాను శ్రీనివాసుడికి మొక్కులు చెల్లించుకున్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యం

డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు



తిరుపతి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యతను విద్యా వలంటీర్లు స్వచ్ఛందంగా చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. తిరుపతి రూరల్ మండల వెలుగు మహిళా సమైక్య సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా స్థాయిలో ఉల్లాస్ పేరిట లెర్నింగ్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ పొందిన శిక్షణ ద్వారా తమపరిధిలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో వలంటీర్లు కీలకంగా వ్యవహరించాలని తెలిపారు. ఎంపీడీవో రామచంద్ర, డీడీ నాగేశ్వర్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ ప్రసాద్, సూపర్‌వైజర్లు థామస్, శైలజ, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ వనజాక్షి, ఏపీఎం నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తులసి, అనిత, వాణి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు రూరల్ మండల సమావేశం

తిరుపతి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10గంటలకు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరుగనుందని ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు హాజరుకావాలని తెలిపారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తిరుపతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం గురువారం ఉదయం 10.30గంటలకు ఎస్వీయూ సెనేట్ హాలులో జరుగనుంది. నగరంలోని వివిధ అభివృద్ధి పనులపై 15 అంశాలతో అజెండాను రూపొందించారు. మేయర్ శిరీషతో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఎక్స్ ఎఫిషియో సభ్యులుగా హాజరుకానున్నారు. ఇటీవల స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలై వాయిదా పడిన అంశాన్ని వైసీపీ కార్పొరేటర్లు చర్చించే అవకాశం కనిపిస్తోంది.

బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై కేసు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అలిపిరి స్టేషన్ పరిధిలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న 15 మందిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ రాంకిషోర్ చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాపుల వద్ద మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

చింతలపాళెంలో పీస్ కమిటీ సమావేశం

షికారీలు, రైతులతో భేటీ అయిన జేసీ ● భూ సమస్యను గ్రామసభలో తెలుసుకున్న అధికారులు



తమ వద్ద ఉన్న రెవెన్యూ రికార్డులను అధికారులకు అందిస్తున్న పరశునాథ్ - రైతుల సమస్యలను వివరిస్తున్న ఈగల సుబ్రహ్మణ్యం

ఏర్పేడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాళెం పంచాయతీ మరాఠీపురం గిరిజనకాలనీలో మంగళవారం పీస్ కమిటీ సమావేశం జరిగింది. గత 50 యేళ్లుగా రైతులు, షికారీల మధ్య నెలకొన్న భూ సమస్యను పరిష్కరించడానికి అధికారులు సమావేశమయ్యారు. ముఖ్య అధికారిగా జేసీ శుభం భన్సల్ హాజరయ్యారు. ఒక్కో వర్గం నుంచి ఒక్కొక్కరికి మాత్రమే మాట్లాడే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... చింతలపాళెం రెవెన్యూ పరిధిలో రైతులు, షికారీల భూ సమస్యపై కోర్టులో కేసు నడుస్తోందని, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. షికారీలు, రైతుల మధ్య నెలకొని ఉన్న భూ సమస్యకు సంబంధించి మొదట ప్రశాంత వాతావరణానికి కమిటీని ఏర్పాటు చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. ఈకార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దారు భార్గవి, సీఐ జయచంద్ర సహా రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షికారీలు మాట్లాడుతూ... భూ సమస్య పరిష్కారమయ్యే వరకు ఎవరు పొలాల్లో దిగినా అడ్డుకుంటామని చెప్పారు. ఎవరూ దిగకుండా ఆదేశాలు జారీ చేయాలని జేసీని కోరారు. దీంతో రైతులు వాగ్వాదానికి దిగారు. పోలీసుల జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు.

డబ్బుతో అక్రమ పట్టాలు సృష్టించుకున్నారు..

చింతలపాళెం రెవెన్యూలో 1971లో మరాఠీపురానికి చెందిన 112 షికారీల కుటుంబాలకు 560ఎకరాలను అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇందిరా గాంధీ ప్రధానమంత్రి హయాంలో కేటాయించింది. 2003లో షికారీలు బతుకుదెరువు, వ్యాపారం చేసుకోవడానికి వలస కూలీలుగా వెళ్లాం. ఇదే అదనుగా భావించిన చింతలపాళెం, వెంకటాపాళెం, రామానుజపల్లెకు చెందిన పలువురు భూస్వాములు సదరు భూములపై కన్నేసి డబ్బుతో అధికారులను కొనుగోలు చేసి అక్రమ పట్టాలు పొందారు. వీటిపై పోరాటం చేస్తున్నాం. భూస్వాముల చేతిలో ఉన్న భూములను అందించండి.

- షికారీల ఉద్యమ నేత డబ్బా పరశునాథ్

1992లోనే ప్రభుత్వం పట్టాలిచ్చింది

1992లో అప్పటి ప్రభుత్వం మూడు గ్రామాల రైతులకు ఒక్కో కుటుంబానికి ఒకటిన్నర ఎకరా చొప్పున అందించింది. చింతలపాళెం రెవెన్యూ అటవీ ప్రాంతంగా పొదలుపొదలుగా ఉన్న భూములను గుర్తించి 1992లో అప్పటి ప్రభుత్వం పట్టాలిచ్చింది. ఆ భూములను తాకట్టు పెట్టి బ్యాంకులో రుణాలు కూడా పొంది ఉన్నాం. రైతులందరూ లక్షల రూపాయలు ఖర్చు చేసి బోర్లు ఏర్పాటు చేసుకుని ప్రస్తుతం పంటలు పండిస్తున్నాం. రైతుల పంటలు వేసుకోవడానికి పొలాల వద్దకు వెళితే షికారీలు అడ్డుకుంటున్నారు.

- ఈగల సుబ్రహ్మణ్యం, రైతు, చింతలపాళెం

14 టైర్ల లారీతో స్తంభించిన ట్రాఫిక్



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అస్తవ్యస్త ట్రాఫిక్ వ్యవస్థకు అద్దం పడుతోందీ చిత్రం. రద్దీగా ఉంగే పసుపర్తి సూపర్ మార్కెట్‌లో మంగళవారం 14 టైర్ల లారీ రోడు మధ్యలో ఇరుక్కుపోయింది. దీంతో దాదాపు గంట పాటు వాహనాల రాక పోకలు స్తంభించిపోయాయి. కొందరు ట్రాఫిక్ పోలీసులు మామూళ్ళకు కక్కుర్తి పడి చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తుడా భవనంలోకి ఎస్సీ హాస్టల్ మార్పు

భాకరాపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. దీనిపై గత నెలలో 'వానకు తడవక తప్పదు' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్త రావడంతో అధికారులు స్పందించారు. మంగళవారం భవనాన్ని పరిశీలించారు. ఇందులో విద్యార్థులు ఉండడం క్షేమకరం కాదని నిర్ధారించారు. వేరే భవనంలోకి విద్యార్థులను తరలించాలని వార్డెన్‌ను ఆదేశించారు. ఖాళీగా ఉన్న తుడా భవనంలోకి హాస్టల్‌ను తరలించారు. దీంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

13, 14 తేదీల్లో పడిపూజ మహోత్సవం

చంద్రగిరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఐతేపల్లె వద్ద సుందరిగిరి అయ్యప్ప స్వామి దేవాయలంలో ఈనెల 13, 14 తేదీల్లో పడి పూజ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ ఉత్సవానికి హాజరుకావాలని ఎమ్మెల్యే పులివర్తి నానికి, ఆలయ నిర్వాహకులు మంగళవారం అందజేశారు. పడిపూజ నిర్వాహకులు వేణుగోపాల్‌నాయుడు, గురుస్వామి, చంద్ర, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

సీమ పందుల పెంపకంతో ఆర్థికాభివృద్ధి


జ్యోతిని వెలిగిస్తున్న డీఈ శోభామణి, డీఆర్ శ్రీలత తదితరులు

తిరుపతి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతుల్లో సీమ పందుల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఎస్వీవెటర్నరీ వర్సిటీ డీఈ ప్రొఫెసర్ డాక్టర్ బి.శోభామణి, డీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత తెలిపారు. వర్సిటీలోని నిరంతర పశువైద్యవిద్య సమాచార కేంద్రం ఆధ్వర్యంలో వ్యవస్థాపక నైపుణ్యాభివృద్ధిలో భాగంగా ఔత్సాహిక రైతులు, యువతకి లాభసాటిగా సీమపందులపెంపకం అనేఅంశంపై నిర్వహించిన మూడ్రోజుల శిక్షణా తరగతులను మంగళవారం వారు ప్రారంభించి మాట్లాడారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి 33మంది ఈశిక్షణకు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానంతో సొంతంగా పందుల పెంపకాన్ని చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని తెలిపారు. సీసీవీఈసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుజాత మాట్లాడుతూ విస్తరణ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కార్యక్రమాలను వివరించి, పందుల పెంపకంలో మెలకువలపై అవగాహన కల్పించారు.

'స్పోర్ట్స్ ఫర్ ఆల్'పై క్రీడాకారుల హర్షం


సంబరాల్లో క్రీడా సంఘాల అధికారులు,క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ ఫర్ ఆల్ నిర్ణయంపై జిల్లా క్రీడాలోకం హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక బాలాజీకాలనీలోని కూడలిలో మంగళవారం సాయంత్రం డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ ఆధ్వర్యంలో కోచ్‌లు, పీడీలు, క్రీడా సంఘాల ప్రతినిధులు, అభిమానులు పరస్పరం స్వీట్లు పంచుకున్నారు. టపాసులు పేల్చుతూ సంబరాలు చేసుకున్నారు. థ్యాంక్యూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శాప్ చైర్మన్ రవి నాయుడు జిల్లావాసి కావడం క్రీడాలోకానికి కలిసొచ్చిన అంశమన్నారు. కార్యక్రమంలో పాటకం వెంకటేష్, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక బాలుడు మృతి చెందిన ఘటన మంగళవారం తిరుపతి రూరల్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు... వేలూరు నుంచి తిరుపతికి వస్తున్న ఆర్టీసీ బస్సు పేరూరు వద్ద సైకిల్‌పై వస్తున్న 15 సంవత్సరాల బాలుడిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్ కళాశాలల క్రీడా పోటీల విజేతలకు పతకాలు


వాలీబాల్ విజేత ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాల జట్టుకు షీల్డ్ అందిస్తున్న వైస్ చాన్సలర్ అప్పారావు

తిరుపతి(క్రీడలు), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ మహిళా అంతర్ కళాశాలల క్రీడా పోటీలు మంగళవారం అట్టహాసంగా జరిగాయి. ఎస్వీయూ మైదానంలో వ్యాయామ విభాగాధిపతి ఆచార్య ఎం.శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మూడు క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. విజేత జట్లకు ఎస్వీయూ వైస్ చాన్సలర్ సి.హెచ్.అప్పారావు, షీల్డ్, ప్రశంసాపత్రాలు, పతకాలను అందజేశారు. వాలీబాల్‌లో మదనపల్లె ప్రభుత్వ కళాశాలపై ఎస్వీడబ్ల్యూ డిగ్రీకళాశాల(తిరుపతి), బ్యాడ్మింటన్‌లో ఎస్వీడబ్ల్యూ డిగ్రీకళాశాల(తిరుపతి)పై శ్రీకాళహస్తి ప్రభుత్వ కళాశాల, ఖోఖోలో ఎస్వీయూ డిగ్రీకళాశాల(తిరుపతి)పై ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాల(తిరుపతి) విజయం సాధించాయి.

విద్యుత్ చార్జీలను పెంచవద్దు : సీపీఎం

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సర్దుబాటు పేరుతో రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు కందారపు మురళి, బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. తిరుపతిలోని ఏపీ సదరన్ డిస్కం కార్యాలయంలో మంగళవారం సంస్థ సీఎండీ కె.సంతోషరావును కలసి వారు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దుబాటు పేరిట సంస్థలు ప్రభుత్వానికి ప్రతిపాదించిన రూ.11,826.42 కోట్ల భారాన్ని విరమించుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రజాందోళనలు చేపడతామన్నారు.



టీటీడీ ఛైర్మన్‌కు టీడీపీ నేతల సన్మానం




తిరుపతి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఛైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడిని స్థానిక టీడీపీ నేతలు ఘనంగా సన్మానించారు. మంగళవారం తిరుపతికి వచ్చిన ఆయన్ను ఓ ప్రైవేట్ హోటల్లో కలిసి శాలువా, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్ యాదవ్, చినబాబు, పాటకం వెంకటేష్, చినబాబు, రుద్రకోటి సదాశివం, సుబ్బుయాదవ్, జగ్గా, సుబ్రమణ్యం, బుజ్జి తదితరులు ఉన్నారు.


క్యాన్సర్ రోగులకు పాలియేటివ్ కేర్‌తో ఊరట

తిరుపతి(వైద్యం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ చివరి దశ బాధితులు కొంత కాలం ఆనందంగా గడపడానికి పాలియేటివ్ కేర్ ఉపయోగపడుతుందని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ చెప్పారు. స్విమ్స్‌లో రేడియేషన్ అంకాలజీ ఆధ్వర్యంలో మంగళవారం పద్మావతి ఆడిటోరియంలో నిరంతర వైద్యవిద్యా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్వీ కుమార్ మాట్లాడుతూ చివరి దశలో ఉన్న క్యాన్సర్ బాధితుల కోసమే ప్రత్యేకంగా పాలియేటివ్ కేర్ సెంటర్‌ను స్విమ్స్ ఏర్పాటు చేసిందన్నారు. ఇది ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో వైద్య విభాగాధిపతులు నరేంద్ర, ప్రాణబంధు దాస్, ఆలోక్ సమంత్రే, సుబ్రమణియన్, శివకుమార్ పాల్గొన్నారు.











శాస్త్రోక్తంగా సుబ్రహ్మణ్య హోమం

తిరుపతి(కల్చరల్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాలలో భాగంగా మంగళవారం కపిలేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య హోమం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఉదయం 8 గంటల నుంచి పూజ, హోమం, లఘు పూర్ణాహుతి, నివేదన, హారతి నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి హోమం, సహస్రనామార్చన, విశేష దీపారాధన జరిగింది. బుధ, గురువారాల్లో కూడా హోమం కొనసాగుతుంది.

ప్రేమించలేదని యువతి ఇంటిపై దాడియత్నం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తన ప్రేమను అంగీకరించలేదనే ఆగ్రహంతో ఓ యువతి ఇంటిపై కొంతమంది స్నేహితులతో ఓ యువకుడు దాడికి ప్రయత్నించిన ఘైనమిది. తిరుపతి యూనివర్శిటీ సీఐ రామయ్య కథనం మేరకు... వాసవీనగర్‌కు చెందిన ఒక యువతి బీ.టెక్ మూడవ సంవత్సరం చదువుతోంది. కొరమేనుగుంటకు చెందిన ట్యాక్సీ డ్రైవర్ ప్రసాద్ కొంతకాలంగా తనను ప్రేమించాలని ఆ యువతి వెంట పడుతున్నాడు. ఆమె అంగీకరించలేదు. దీంతో ఆగ్రహించిన ప్రసాద్ సోమవారం రాత్రి కొంతమంది అల్లరి మూకను తీసుకెళ్లి యువతి, ఆమె తల్లి, బంధువులను బెదిరించాడు. దాడికి యత్నించారు. బాధిత యువతి తల్లి మంగళవారం చేసిన ఫిర్యాదు మేరకు .పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాయిధరమ్‌తేజ్‌కు సాదరస్వాగతం

తిరుపతి అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సినీనటుడు సాయిధరమ్‌తేజ్ శ్రీవారి దర్శనార్థం మంగళవారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు జనసేన పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి, ఎమ్మెల్యే తనయుడు ఆరణి మదన్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సాయిధరమ్‌తేజ్ అభిమానుల ర్యాలీ మధ్య తిరుమలకు బయలుదేరారు.



తిరుమల రెండో ఘాట్‌రోడ్డు పక్కన ఉన్న ఖాళీ మద్యం సీసాలు, సిగరెట్, గుట్కా ప్యాకెట్లు

ఇదేంది స్వామి!



తిరుమలకు మద్యం, మాంసం, పొగాకు ఉత్పత్తులైన సిగరెట్, బీడీ, గుట్కా, హాన్స్ వంటివి నిషేధం. వీటిని అలిపిరి భద్రత తనిఖీల్లోనే గుర్తించి అడ్డుకోవాలి. కానీ భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంతో తరచూ తిరుమలకు నిషేధిత వస్తువులు వస్తూనే ఉన్నాయి. ఈక్రమంలోనే తిరుమలకు వెళ్లే రెండో ఘాట్ రోడ్డులో వినాయక స్వామి ఆలయం దాటాక వచ్చే షెడ్డుకు సమీపంలో ఇలా తాగి పడేసిన మద్యం సీసాలు, వాడేసిన గుట్కా, హాన్స్, సిగరెట్ ప్యాకెట్లు భారీగా పడున్నాయి. ఒకే ప్రాంతంలో పోగేసినట్టుగా ఉన్న వీటిని చూసి భక్తులు విస్మయం చెందుతున్నారు. భక్తుల సమాచారంతో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పెద్దశేషవాహనంపై మలయప్ప


నాగుల చవితి సందర్భంగా మంగళవారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మలయప్ప స్వామి పెద్దశేష వాహనంపై మాడవీధుల్లో ఊరేగారు. విశేష అలంకరణలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఎన్నికల్లో ఘోరంగా అధికారం కోల్పోయిన జగన్ పార్టీ అత్యాచార రాజకీయాలకు తెర లేపింది. ఎర్రావారిపాళెం మండలంలో సోమవారం రాత్రి జరిగిన ఒక సంఘటనపై నానా యాగీ చేసింది. నిజానిజాలు తెలుసుకోకుండా 14 ఏళ్ల బాలిక భవిష్యత్తును రచ్చకెక్కించేందుకు తెగబడింది. తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించే పేరుతో నాయకులంతా క్యూకట్టారు. హడావుడి చేశారు. చంద్రబాబు ప్రభుత్వం విఫలమైపోయిందంటూ వీరంగాలు వేశారు. చివరికి పదో తరగతి చదువుతున్న బాలిక తండ్రి చేతులు జోడించి..' నా బిడ్డమీద ఎటువంటి అత్యాచారం జరగలేదు. నా బిడ్డ భవిష్యత్తును పాడు చేయద్దు స్వాములాలా' అని కన్నీటితో వేడుకోవాల్సి వచ్చింది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



నా బిడ్డపై ఎటువంటి అత్యాచారం జరగలేదు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వేధింపులకు మాత్రమే పాల్పడ్డారు. అయితే మీడియాలో, కొందరు రాజకీయ నేతలూ నా బిడ్డపై అత్యాచారం జరిగిందని తప్పుడు ప్రచారాలు చేస్తూ మా పరువు తీస్తున్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా నా బిడ్డ భవిష్యత్తును నాశనం చేయకండి.

- బాలిక తండ్రి

అత్యాచారం అబద్ధం: ఎస్పీ



14 ఏళ్ల విద్యార్థినిపై ఎటువంటి అత్యాచారం జరగలేదని వైద్య పరీక్షల్లో వైద్యులు స్పష్టంగా నిర్ధారించారు. పాఠశాల నుంచి వస్తున్న విద్యార్థినిని ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి అడ్డుకొని ప్రేమించాలని వేధింపులకు పాల్పడ్డారు. కొన్ని పత్రికల్లో రాసినట్లు, కొందరు నేతలు పేర్కొంటున్నట్లు బాలికపై ఎటువంటి అత్యాచారం జరగలేదు. ఇటువంటి సున్నితమైన విషయాల గురించి మాట్లాడే ముందు నిజనిజాలు పూర్తిగా తెలుసుకోవాలి. మీడియా కూడా ఎలాంటి ఆధారాలు, అధికారుల వివరణ లేకుండా అసత్యాలు ప్రసారం చేయడం మంచిది కాదు.బాలికను వేధింపులకు గురిచేసిన వారిని తప్పక అదుపులోకి తీసుకొని తగు చర్యలు చేపడతాం.

- సుబ్బారాయుడు, జిల్లా ఎస్పీ



అమానవీయ రాజకీయం

బాలికపై అత్యాచారం అంటూ నానా యాగీ

పరామర్శల పేరుతో హడావుడి - వైసీపీ నేతల తీరుపై జనంలో ఆగ్రహం



ప్రసూతి ఆస్పత్రి ముందు బైఠాయించిన వైసీపీ నేతలు, మీడియాతో మాట్లాడుతున్న రోజా

మీకు మానవత్వం లేదా: పులివర్తి నాని

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, అక్కడ వైసీపీ నేతల తీరును దుయ్యబట్టారు. పబ్లిసిటీ కోసం వైసీపీ సోషల్ మీడియాతో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మానవత్వం లేకుండా బాలిక విషయంలో అసత్యాలను ప్రచారం చేయించారని ఆరోపించారు. ఉదయం నుంచి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ఫోన్ చేస్తూ ఎప్పటికప్పుడు బాలిక పరిస్థితి, వివరాలను అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన ప్రతీ ఒక్కరిపై తప్పక చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామన్నారు.

ఆస్పత్రి వద్ద వైసీపీ నేతల హల్‌చల్

ప్రసూతి ఆసుపత్రికి ఉదయమే పులివర్తి సుధారెడ్డి చేరుకొని మధ్యాహ్నం వరకు అక్కడే ఉండి బాలికను పరామర్శించి, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు భూమన అభినయ్, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. వీరిని పోలీసులు ఆస్పత్రిలోకి అనుమతించకుండా అడ్డుకున్నారు. సాధారణంగా మగవారిని ప్రసూతి ఆస్పత్రిలోకి అనుమతించరు. దీంతో వారు ఆస్పత్రి ముందు బైఠాయించారు. బాలికను పరామర్శించి ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన మాజీ మంత్రి రోజా తన సహజ ధోరణిలో ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలకు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాలలో సీటు కేటాయింపు

తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి: యర్రావారిపాళెం మండలంలో దాడికి గురైన బాలిక.. తదుపరి విద్యను కొనసాగించేందుకు అక్కడి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సీటు కేటాయించినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమె చదువు కొనసాగించడానికి తగిన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.



ఎట్టకేలకు పట్టుబడిన సీఎస్‌డీటీ విష్ణు

పుత్తూరు కోర్టులో హాజరు పరిచిన పోలీసులు

రేషన్ బియ్యం అక్రమాల్లో కడప, నగరి, ఏర్పేడు బియ్యం వ్యాపారుల భాగస్వామ్యం

మరో పౌరసరఫరాల శాఖ అధికారి కూడా

5,040 బస్తాల అమ్మకంతో రూ.29.70 లక్షల ఆర్జన

పుత్తూరు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పుత్తూరు పౌరసరఫరాల శాఖ గోదాములో రేషన్ బియ్యం అక్రమంగా తరలించిన సీఎస్‌డీటీ సీహెచ్ విష్ణు ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డాడు. సోమవారం పట్టుబడిన ఇతడిని మంగళవారం రిమాండ్ నిమిత్తం పుత్తూరులోని ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. పుత్తూరు ఎస్డీపీవో రవికుమార్ పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించనున్నట్లు సీఐ కె.వి.సురేంద్రనాయుడు తెలిపారు. పుత్తూరు, పిచ్చాటూరు పౌరసరఫరాల శాఖ మండల లెవల్ స్టాక్ (ఎంఎల్‌ఎస్) పాయింట్లలో సీఎస్‌డీటీగా సీహెచ్ విష్ణు 2022 డిసెంబరు నుంచి 2024 ఆగస్టు వరకు విధులు నిర్వహించాడన్నారు. గోడౌన్ల నుంచి సుమారు 4,056 రేషన్ బియ్యం బస్తాలను అక్రమంగా విక్రయించినట్లు గుర్తించామన్నారు. ఉద్యోగ బాధ్యతలను విస్మరించి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టాడనే నేరారోపణలపై అరెస్టు చేశామన్నారు. ఆహార భద్రతా చట్టం -1955 అండర్ సెక్షన్ 314, 316, 316(5), 318(4), 7(1) కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అక్రమాల్లో బియ్యం వ్యాపారుల భాగస్వామ్యం

రేషన్ బియ్యం అక్రమాల్లో కడప, నగరి, ఏర్పేడుకు చెందిన కొందరు బియ్యం వ్యాపారులతో పాటు పౌరసరఫరాల శాఖకు చెందిన మరో అధికారి భాగస్వామ్యం ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను నియమించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది. పుత్తూరు ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి 2,840 బియ్యం బస్తాలు విక్రయించి రూ.14.90 లక్షలు, పిచ్చాటూరు ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి 2,200 బస్తాలు విక్రయించి రూ.14.80 లక్షలు అక్రమంగా ఆర్జించినట్లు పోలీసుల విచారణలో తేలింది.

అప్పులకు.. విలాసాలకు..

ఈ అక్రమ సంపాదనను సీఎస్‌డీటీ విష్ణు తాను చేసిన అప్పులకు గాను నెల్లూరుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డికి రూ.14 లక్షలు, పాపిరెడ్డికి రూ.1.50 లక్షలు, గూడూరుకు చెందిన రమణరాజుకు రూ.1.50 లక్షలు, చెన్నైకి చెందిన మరికొందరి నగదు రూపంలో చెల్లించినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకొన్నట్లు తెలిసింది. ఇక, విలాసాలకు ఖర్చు చేసిన మొత్తం ఎంతనేది లెక్క తేలలేదని పోలీసులు అంటున్నారు. నెల్లూరు జిల్లా కలువాయి మండలంలోని తన సొంతూరు రాజుపాళెంలో ఒక ఇల్లు, రెండు రేకుల షెడ్లు, బైక్ ఉందని, తన తల్లి పేరున ఎకరా మామిడి తోట ఉన్నట్టు విచారణలో విష్ణు చెప్పినట్లు సమాచారం.

కత్తితో ఆటో డ్రైవరు వీరంగం

స్నేహితుడి కుటుంబంపై దాడితో ముగ్గురికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తిలో కలకలం



చికిత్స పొందుతున్న సతీష్, గణేష్



చికిత్స పొందుతున్న కీర్తన

శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ కత్తితో విచక్షణా రహితంగా రెచ్చిపోయాడు. వేకువ జామున 4 గంటల సమయంలో స్నేహితుడి ఇంటికెళ్లి హత్యాయత్నానికి తెగబడ్డాడు. అడ్డుకున్న అతడి భార్య, మామనూ గాయపరిచాడు. రక్తం కారుతుండగా ముగ్గురూ పోలీసు స్టేషనుకు పరుగు తీశారు. తెల్లారేసరికి పట్టణ ప్రధాన రహదారిలో కనిపించిన రక్తపు మరకలతో శ్రీకాళహస్తిలో కలకలం రేగింది.

పట్టణంలోని జెట్టిపాళేనికి చెందిన సతీష్, ముత్యాలమ్మ గుడి వీధికి చెందిన మణి ఆటో డ్రైవర్లు. వీరిద్దరూ స్నేహితులు. మద్యంమత్తులో తరచూ వాగ్వాదం చోటు చేసుకునేది. సోమవారం రాత్రి ముత్యాలమ్మ గుడి వీధిలో మద్యం మత్తులో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో మంగళవారం వేకువన నాలుగున్నర గంటల సమయంలో కత్తి చేత పట్టుకున్న మణి.. జెట్టిపాళెంలోని సతీష్ ఇంటికెళ్లి తలుపు కొట్టాడు. వెలుపలకు వచ్చిన సతీష్‌పై కత్తితో దాడి చేశాడు. అరుపులు విన్న కీర్తన.. తన భర్తను కాపాడుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఆమెపైనా నిందితుడు కత్తితో దాడి చేశాడు. కీర్తన తండ్రి గణేష్ వచ్చి మణిని అదుపు చేసేందుకు ప్రయత్నించగా, అతడిపైనా దాడి చేశాడు. దీంతో రక్తం కారుతుండా ముగ్గురూ జెట్టిపాళెం నుంచి పెళ్లి మండపం మీదుగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు పరుగుతీశారు. వెంటనే వీరిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సతీష్‌కు పొట్ట పైన, కీర్తనకు నడుము కింద, గణేష్‌కు చేతిపైన కత్తిపోట్లతో గాయాలైనట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఈ ఘటనపై శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న మణి కోసం గాలిస్తున్నారు. బాధితులు పరుగు తీసిన రోడ్డంతా రక్తపు మరకలయ్యాయి.

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి ఘన స్వాగతం



బీఆర్ నాయుడికి స్వాగతం పలుకుతూ తిరుపతిలో భారీగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

తిరుపతిరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడు ప్రమాణస్వీకారాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లాకు వచ్చిన నేపథ్యంలో అభిమానులు వినూత్నరీతిలో స్వాగతం పలికారు. రాజమండ్రికి చెందిన ఆయనకు కోనేరు మురళి, తూర్పు గోదావరి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కురుకూరి కిషోర్ నేతృత్వంలో రేణిగుంట విమానాశ్రయం నుంచి అలిపిరివరకు.. అక్కడ్నుంచి ఆయన ఇంటి వరకు దారిపొడవునా పెద్దఎత్తున్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి సాదర స్వాగతం పలికారు. అలాగే, తిరుపతిలోని ఆయన నివాసం వరకూ ఫ్లెక్సీలు, బ్యానర్లను కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.



బ్రెస్ట్ క్యాన్సర్ హెల్ప్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోండి



తిరుపతి కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్యసంరక్షణ కోసం బ్రెస్ట్ క్యాన్సర్ హెల్ప్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుని తద్వారా మరింత అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మహిళలలో బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు సంబంధించి స్వీయ పరీక్ష పోస్టర్‌ని మంగళవారం కలెక్టరేట్‌లో ఆరోగ్యశాఖ, పరివర్తన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారు స్వీయ పరీక్ష చేసుకుని సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత పరీక్షలతోపాటు చికిత్స పొందాలని తెలిపారు. సి.హాయ్, పరివర్తన సంస్థల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా దీనిపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు సాయి ధరమ్‌తేజ్

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): సినీ హీరో సాయి ధరమ్‌తేజ్ మంగళవారం రాత్రి 11 గంటలకు తిరుమలకు వచ్చారు. అలిపిరి నుంచి కాలినడకను వచ్చిన ఆయనకు జీఎన్సీ వద్ద స్థానిక అభిమానులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఫీనిక్స్ అతిథి గృహానికి చేరుకుని రాత్రి బస చేశారు. బుధవారం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఆర్టీసీ అప్రెంటీస్‌షిప్‌నకు 13 నుంచి ఇంటర్వ్యూలు

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న తిరుపతి, చిత్తూరు జిల్లాల అభ్యర్థులకు 15న ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఈ మేరకు ఇన్‌చార్జి డీపీటీవో జగదీష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూ కోసం రెజ్యూమ్, ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ, 10వ తరగతి, ఐటీఐ మార్కులలిస్టులు, కులధృవీకరణ పత్రం, వికలాంగులు, మాజీ సైనికుల పిల్లలైతే ఆచా సర్టిఫికెట్లు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్‌కు సంబంధించిన ధృవీకరణపత్రం, ఆధార్, అన్ని ఒరిజినల్స్ తీసుకు రావాలని పేర్కొన్నారు. నెల్లూరు సమీపంలోని కాకుటూరులో ఉన్న ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాలకు హాజరు కావాల్సి ఉంది.

శిల్పారామంలో సీఈవో తనిఖీ



శిల్పారామంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఈవో స్వామినాయుడు

తిరుచానూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని శిల్పారామాన్ని మంగళవారం ఏపీ రాష్ట్ర శిల్పారామం సీఈవో వి.స్వామినాయుడు తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రమాదం జరిగిన ప్రదేశంపై ఆరాతీసి, ఇకపై ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన క్రాస్‌వీల్, జాయింట్ వీల్, లిఫ్ట్ మగ్రమెంట్ అనుమతులు రద్దుచేయాలని ఆదేశించారు. పిల్లలు ఆడుకునేందుకు ప్రమాదాలకు అవకాశాలు లేనివాటిని మాత్రమే అనుమతించాలని, ల్యాండ్ స్కేపింగ్‌ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని శిల్పారామాలకు ఇదే నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. శిల్పారామం అభివృద్ధికి కావాల్సిన అనుమతులకోసం వెంటనే నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఏవో, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

తిరుమలకు వస్తే పాజిటివ్ ఫీలింగ్



అనన్య నాగళ్ల

తిరుమల, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు ఎప్పుడు వచ్చినా మంచి పాజిటివ్ ఫీలింగ్ వస్తుందని సినీనటి అనన్య నాగళ్ల అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'పొట్టేల్' చిత్రం తనకు మంచి పేరు తీసుకొచ్చిందన్నారు. త్వరలో మంచి ప్రాజెక్టులు చేయనున్న క్రమంలో స్వామి ఆశీస్సుల కోసం వచ్చానన్నారు.



ఎనిమిది అడుగుల జెర్రిపోతు

తిరుమల, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): తిరుమల జీఎన్సీ గార్డెన్‌లోని ఓ గదిలోకి మంగళవారం సుమారు ఎనిమిది అడుగుల జెర్రిపోతు చొరబడింది. పామును గుర్తించిన గార్డెన్ సిబ్బంది వెంటనే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడుకి సమాచారమిచ్చారు. ఆయన పామును పట్టుకోవడంతో అక్కడివారు ఊపిరిపీల్చుకున్నారు. అలాగే రింగురోడ్డులోని డ్రైనేజ్ వాటర్ ప్లాంట్ వద్ద మరో నాలుగు అడుగుల పొడవైన నాగుపామును కూడా భాస్కర్ పట్టుకున్నారు. ఈ రెండింటినీ దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, తానంకి నానాజీ

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందుకున్న వారు కూటమి ప్రభుత్వం పట్ల కృతజ్ఞత చూపాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను, ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధిని నిర్వీర్యం చేసిందన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే నియోజకవర్గ పరిధిలో 9మందికి రూ.10.63 లక్షల ఆర్థిక సాయాన్ని అందించామని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గ పరిధిలో పలువురికి రూ.9కోట్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పెంచలకోన ట్రస్ట్‌బోర్డు మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, నరసింహులు నాయుడు, ఇశ్రాయిల్ కుమార్, భాస్కర్‌రెడ్డి, కోటేశ్వరరావు, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునేందుకు సుధా అనే మహిళకు మూడు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఆర్డీ సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, ఏపీఆర్డీ రాష్ట్ర కోఆర్డినేటర్ శిల్పా ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

చియాంగ్ మై వర్సిటీతో ఆదిశంకర ఎంవోయూ

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): థాయ్‌లాండ్‌లోని చియాంగ్ మై వర్సిటీతో స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాల ఛైర్మన్ డాక్టర్ పెంచలయ్య థాయ్‌లాండ్ వెళ్లి చియాంగ్ మై వర్సిటీ ప్రతినిధులతో చర్చించారు. శాస్త్ర, సాంకేతిక అంశాల్లో పరిశోధన, విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తదితర అంశాల్లో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు పెంచలయ్య తెలిపారు. అంతర్జాతీయ ప్రయాణాలు కలిగిన చియాంగ్ మై వర్సిటీతో ఒప్పందం వల్ల ఆదిశంకర విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక అంశాల్లో పరిశోధనకు ఎంతో ఉపకరిస్తుందన్నారు.

నెల్లూరుపల్లి కొత్తపాళెంలో గ్రామసభ

కోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి, కొత్తపాళెం, విశ్వనాథపురం అగ్రహారం గ్రామాల్లో భూముల రీసర్వేపై మంగళవారం తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. భూ సమస్యలపై రైతులు అర్జీలు ఇచ్చారు. రీ సర్వేలో పొరపాట్లను అధికారులు పరిష్కరించారు.

వైసీపీకి పూర్వ వైభవం తీసుకొస్తాం: రాంకుమార్

వెంకటగిరి టౌన్, నవంబరు 5,(ఆంధ్రజ్యోతి): వైసీపీకి పూర్వ వైభవం తీసుకొస్తామని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమస్యలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు గుర్తించుకుని కార్యకర్తలు, నాయకులను కలుపుకుని పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో వైసీసీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

నాయుడుపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలోని కట్టకాలనీ వద్ద లక్ష్మీప్రియ(18) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... కట్టకాలనీలో నివసిస్తున్న లక్ష్మీప్రియ కొంతకాలంగా ఓ సూపర్ మార్కెట్‌లో పనిచేస్తోంది. నాలుగు రోజుల క్రితం సూపర్‌మార్కెట్‌లో నగదు తేడా రావడంతో లక్ష్మీప్రియ తీసుకుందని నిందించారు. ఆమె తల్లిదండ్రులు సూపర్‌మార్కెట్ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. కాగా, మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని లక్ష్మీప్రియ మృతి చెంది ఉండడాన్ని తల్లిదండ్రులు గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

84 మద్యం బాటిళ్ల స్వాధీనం

నాయుడుపేట టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎక్సైజ్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 84మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారి సత్యనారాయణ తెలిపారు. పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడులో మంగళవారం దాడులు నిర్వహించగా అంకమ్మ అనే మహిళ 30 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టణ పరిధిలోని పాత వెంకటగిరి రోడ్డులో విజయమ్మ అనే మహిళ నుంచి 54 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారి తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని మోటరు సైక్లిస్టుకు తీవ్రగాయాలు

నాయుడుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - అన్నమేడు జాతీయ రహదారి సమీపంలో మోటారు సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బిట్రగుంటకు చెందిన ప్రేమ్‌కుమార్ మోటరు సైకిల్‌పై బెంగళూరుకు వెళ్తుండగా నాయుడుపేట సమీపంలోకి ట్రాక్టర్ ఢీ కొందది. తీవ్రంగా గాయపడిన ప్రేమ్‌కుమార్‌ను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవలకై నెల్లూరుకు తీసుకెళ్లారు.

మినీ గోకులాలకు భూమిపూజ

కోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడు పంచాయతీలో మినీ గోకులానికి మంగళవారం భూమిపూజ జరిగింది. టీడీపీ నాయకులు రఘురామయ్య, కృష్ణ, శ్రీనివాసులు, పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్, టెక్నికల్ అసిస్టెంట్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భూమిపూజ చేసి మినీ గోకులాల పనులను ప్రారంభించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

స్వర్ణముఖి నదిలో నీటమునిగి పదో తరగతి విద్యార్థి మృతి


విద్యార్థి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ చిన్నబలరామయ్య


వీరేందర్ సాయి (ఫైల్‌ఫొటో)

చిట్టమూరు, నవంబర్ 5(ఆంధ్రజ్యోతి): సరదాగా ఈతకెళ్లిన విద్యార్థి నీట మునిగి మృత్యువాత పడిన ఘటన చిట్టమూరు మండలంలో సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం మేరకు... కోట మండలం, విద్యానగర్ ప్రకాష్ కాలనీకి చెందిన సాయి, రాధా దంపతుల కుమారుడు వీరేందర్ సాయి(15) చిట్టమూరు మండలం మెట్టు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత తోటి విద్యార్థులు అంకయ్య, వంశీ, అప్పీతో కలిసి వీరేందర్ సాయి మెట్టు సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. వీరేందర్ సాయి, వంశీ ఇసుక ఊబిలో మునిగిపోతుండడంతో అంకయ్య అప్రమత్తమై వంశీని గట్టుకు లాకొచ్చాడు. ఇంతలో వీరేందర్ సాయి నీట మునిగిపోయాడు. దీంతో భయపడిన అంకయ్య, వంశీ, అప్పీ అక్కడ నుంచి వెళ్లిపోతూ వీరేందర్ సాయి బట్టలను ఇసుకలో పాతిపెట్టారు. పుస్తకాల బ్యాగ్‌ను ఊరిబయట కంప చెట్లలో పడేశారు. చీకటి పడుతున్నా కుమారుడు ఇంటికి రాకపోవడంతో వీరేందర్ సాయి తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆరా తీసినప్పటికీ విద్యార్థులు ఎవరూ చెప్పలేదు. మంగళవారం ఉదయం వీరేందర్ సాయి తల్లిదండ్రులు ముగ్గురు విద్యార్థులనూ బతిమలాడగా జరిగిన సంఘటన గురించి వంశీ వివరించాడు. ఈతకు వెళ్లిన చోట గాలించగా వీరేందర్ సాయి మృతదేహం లభ్యమైంది. పోలీసులు సమాచారం ఇవ్వగా ఎస్ఐ చిన్న బలరామయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వీరేందర్ సాయి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ఇసుక గోతులే విద్యార్థి ప్రాణం తీశాయ్

గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక దోపిడీకి ఆనవాళ్లుగా మిగిలిన గోతులే విద్యార్థి ప్రాణాలను బలిగొన్నాయని మెట్టు గ్రామస్తులు ఆరోపించారు. స్వర్ణముఖి నదిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాల వల్ల ఏర్పడిన గోతుల్లో వీరేందర్ సాయి ఇరుక్కుపోవడం వల్లే మృత్యువాత పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు.

దిగ్ర్భాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే

స్వర్ణముఖిలో ఈతకెళ్లిన విద్యార్థి వీరేందర్ సాయి మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. వీరేందర్ సాయి కుటుంబానికి ఎమ్మెల్యే రూ.పది వేల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు టీడీపీ నేతలు శ్రీనివాసులురెడ్డి, శ్రావణ్ తెలిపారు.

విపత్కర పరిస్థితుల్లో ధైర్యం కోల్పోవద్దు


మనిషిపై చెట్టుకూలిపోయిన సమయంలో తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందం

తడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుపాన్లు, సునామీల వంటి విపత్కర పరిస్థితుల్లో ధైర్యం కోల్పోకూడదని, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ప్రమాదాల నుంచి ఎలా బయట పడాలో ఆలోచించాలని తహసీల్దారు శరత్‌బాబు అన్నారు. మంగళవారం భీములవారిపాళెం సచివాలయం వద్ద ఎస్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో సునామీపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. తహసీల్దారు శరత్‌బాబు మాట్లాడుతూ తుపాన్లు, సునామీ వంటి విపత్కర పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మాక్‌డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి 9వ బెటాలియన్ ఎస్‌డీఆర్ఎఫ్ ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపీడీవో విజయకుమార్, ఎంఈవో మల్లికార్జున, గృహ నిర్మాణశాఖ ఏఈ సత్యనారాయణ, అటవీశాఖ రేంజర్ సౌజన్య, సర్పంచు గీతాప్రకాష్, టీడీపీ నాయకుడు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

తూపిలిపాళెంలో సునామీపై మాక్‌డ్రిల్

వాకాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుపిలిపాళెంలో మంగళవారం తహసీల్దారు రామయ్య ఆధ్వర్యంలో సునామీపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. సునామీ సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ముందస్తు చర్యలు ఎలా చేపట్టాలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఎస్ఐ నాగబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, పశుసంవర్ధకశాఖ వైద్యులు రమణయ్య, కృష్ణారావు, గ్రామస్థులు వెంకట రమణయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి


చిల్లకూరులో తెలుగుగంగ కార్యాలయం వద్ద పుట్టకు పూజలు

గూడూరు, చిల్లకూరు, వెంకటగిరి టౌన్, ఓజిలి, నాయుడుపేట టౌన్, తడ, కోట, సూళ్లూరుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి పర్వదినాన్ని మంగళవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గూడూరు కోర్టు ఆవరణ, విఘ్నేశ్వరపురం ప్రాంతాల్లోని నాగులపుట్ట వద్ద, శివాలయం, కోదండరామాంజనేయస్వామి ఆలయాల్లోని నాగశిలలకు పూజలు చేశారు. ● చిల్లకూరు తెలుగుగంగ కార్యాలయం సమీపంలో ఉన్న పుట్ట, శంకరన్ గిజనకాలనీలోని పుట్ట, సమీప పొలాల్లోని పుట్టల వద్ద పూజలు చేశారు. ● వెంకటగిరి పట్టణంలోని కాశీవిశ్వనాథ స్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయం, కౌవల్యా నది ఒడ్డున ఉన్న నాగ మందిరం పుట్ట వద్ద పూజలు చేసి పాలు పోశారు. ● ఓజిలి, కురుగొండ, మానమాల, వెంకటరెడ్డిపాళెం గ్రామాల సమీపంలోని పుట్టల వద్ద మహిళలు పూజలు చేశారు. ● నాయుడుపేట రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఉన్న పుట్ట, స్వర్ణముఖినది తీరాన, విన్నమాల దగ్గర ఉన్న పుట్టల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. ● తడ మండలంలో గ్రామాల్లోని పుట్టలను పూలతో అలంకరించారు. పాలు, కోడిగుడ్లు, జొన్నలు, సజ్జలు స్వామివారికి నైవేద్యాలుగా సమర్పించారు. ● కోట మండల పరిధిలోని గూడలి, కేశవరం, చిట్టేడు, మద్దాలి, తిన్నెలపూడి, వెంకన్నపాళెం, కోట, విద్యానగర్‌లో మహిళలు నాగుల చవితి పర్వదినాన్ని జరుపుకున్నారు. పుట్టల్లో పాలు, కోడిగుడ్లను వేసి మొక్కులు తీర్చుకున్నారు. ● సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం వద్దనున్న పుట్ట, కేఆర్‌పాలెం వద్దనున్న సాయిబాబా ఆలయం, మన్నారుపోలూరు రోడ్డులో ఉన్న పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

గూడూరు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో నాసా ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థులను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద అభినందించారు. కార్యక్రమంలో మునిగిరీష్, శివకుమార్, జలీల్, శ్రీకాంత్, శ్రీహరి బాబు, హరిబ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

హైవే పనులకు అడ్డంకులు తొలిగించండి

పెళ్లకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట 71వ జాతీయ రహదారి నిర్మాణ పనులకు అడ్డంకులు త్వరితగతిన తొలించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పెళ్లకూరు మండల రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలంలో జాతీయ రహదారి నిర్మాణ పనులకు సంబంధించి నష్ట పరిహారం చెల్లింపు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా తాళ్వాయిపాడు, చావాలి చిల్లకూరు గ్రామాల్లో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ యువరాజు, ఆర్ఐ సంతోషీబాయి, వీఆర్వోలు రమేష్, వంశీకృష్ణ, సుధాకర్, తేజ, కల్యాణి, మోబీనా, సుమతి తదితరులు పాల్గొన్నారు.

దామానెల్లూరులో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

సూళ్లూరుపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామానెల్లూరులో మంగళవారం స్విమ్స్, బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి విశేష స్పందన లభించింది. మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో పేర్నాడు పీహెచ్‌సీ వైద్యాధికారి రమణయ్య, సర్పంచు వి.రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

పోలేరమ్మకు పొంగళ్లు

ఓజిలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్లకనుపూరులో మంగళవారం గ్రామదేవత పోలేరమ్మకు అంబలి పొంగళ్లు పెట్టారు. ఈ నెల 8వ తేదీనుంచి 10వ తేదీ వరకు మూడు రోజులపాటు అమ్మవారికి గ్రామ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తుడు బచ్చల రవీంద్రారెడ్డి తెలిపారు.

పుత్తూరు వార్తలు

రాష్ట్రాభివృద్ధికి తోడ్పడండి

ప్రవాసాంధ్రులు, పారిశ్రామికవేత్తలతో ఎమ్మెల్యే భాను



సమావేశంలో మాట్లాడుతున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, నవంబర్ 5(ఆంధ్రజ్యోతి): తెలుగువారు రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటు నందించాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అమెరికాలోని ప్రవాసాంధ్రులు, పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా లోవా స్టేట్ ట్రెజరర్ రాబీస్మిత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ప్రవాసాంధ్రులైన వైద్యులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వం పెట్టుబడులకు మెరుగైన అవకాశాలను కల్పిస్తోందన్నారు. పారిశ్రామికంగా ప్రోత్సహించేందుకు మరెన్నో రాయితీలను ఇస్తోందన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి వైపు దూసుకుపోతుందన్నారు. నేడు ఏపీ పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలంగా ఉందని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐలు ఆరి నవీన్, బండా హరి, కొమ్మినేని విజయ్, డాక్టర్ కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా నాగులమ్మకు పూజలు


ప్రత్యేక అలంకరణలో నాగాలమ్మ

పుత్తూరు టౌన్, నవంబర్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలో నాగుల చవితిని భక్తులు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద ఉన్న నాగాలమ్మ ఆలయంలో నాగుల దేవతకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పుట్టకు పసుపు దారాలు చుట్టి మొక్కులు తీర్చుకున్నారు.

8న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పుత్తూరు టౌన్, నవంబర్ 5(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8వ తేదిన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సంబంధిత రికార్డులతో హాజరు కావాలని కోరారు.

ఉచితంగా హౌస్ వైరింగ్‌పై శిక్షణ

చంద్రగిరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 11 నుంచి 30 రోజుల పాటు పురుష అభ్యర్థులకు హౌస్ వైరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు తెలిపారు. 9 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుండి తెల్ల రేషన్ కార్డు కలిగిన గ్రామీణ ప్రాంతం వారు అర్హులన్నారు. కనీసం పదోతరగతి చదివి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఫోన్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289, 6301717672 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

భూమనకు చంద్రబాబుని విమర్శించే స్థాయి లేదు: టీడీపీ

నాగలాపురం, నవంబరు 5,(ఆంధ్రజ్యోతి) సీఎం చంద్రబాబును విమర్శించే స్థాయి టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డికి లేదని ఐటీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు యాచేంద్ర నాయుడు అన్నారు. సోమవారం చిత్తూరు, తిరుపతి జిల్లాల వైసీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన కరుణాకర రెడ్డి తిరుపతిలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో సీఎంను ఢీకొనడం బెండును ఢీకొనడం అంటూ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. కొండమీద శ్రీవారి టిక్కెట్ల దగ్గర నుంచి తిరుపతిలో ఆస్తులు పెంచుకునే వరకు, తిరుమలలో కల్తీ నెయ్యి, టీడీఆర్ బాండ్ల స్కాం, గ్రానైట్, మట్టి, గ్రావెల్ మాఫియా, భూ కబ్జాలు, వైసీపీ అధినాయకుడి తల్లి విజయమ్మ సంతకం ఫోర్జరీ చేసి ఆస్తులు కొట్టేసి, దానికి రెడీ చేసిన లెటర్, మీ నాయకుల కామకేళి దగ్గర నుంచి అన్నీ విషయాలను టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలకు తెలియజేసి మీ బెండు తీశారన్నారు. లెవన్‌రెడ్డి సహా 11మంది అసెంబ్లీకి వచ్చి ప్రజా సమ స్యలపై సూచనలు చేయించే బాధ్యత కరుణాకరరెడ్డి తీసుకోవాలని యాచేంద్ర నాయుడు పేర్కొన్నారు.

చింతలపాళెంలో పీస్ కమిటీ సమావేశం

షికారీలు, రైతులతో భేటీ అయిన జేసీ ● భూ సమస్యను గ్రామసభలో తెలుసుకున్న అధికారులు


తమ వద్ద ఉన్న రెవెన్యూ రికార్డులను అధికారులకు అందిస్తున్న పరశునాథ్ - రైతుల సమస్యలను వివరిస్తున్న ఈగల సుబ్రహ్మణ్యం

ఏర్పేడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాళెం పంచాయతీ మరాఠీపురం గిరిజనకాలనీలో మంగళవారం పీస్ కమిటీ సమావేశం జరిగింది. గత 50 యేళ్లుగా రైతులు, షికారీల మధ్య నెలకొన్న భూ సమస్యను పరిష్కరించడానికి అధికారులు సమావేశమయ్యారు. ముఖ్య అధికారిగా జేసీ శుభం భన్సల్ హాజరయ్యారు. ఒక్కో వర్గం నుంచి ఒక్కొక్కరికి మాత్రమే మాట్లాడే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... చింతలపాళెం రెవెన్యూ పరిధిలో రైతులు, షికారీల భూ సమస్యపై కోర్టులో కేసు నడుస్తోందని, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. షికారీలు, రైతుల మధ్య నెలకొని ఉన్న భూ సమస్యకు సంబంధించి మొదట ప్రశాంత వాతావరణానికి కమిటీని ఏర్పాటు చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. ఈకార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దారు భార్గవి, సీఐ జయచంద్ర సహా రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షికారీలు మాట్లాడుతూ... భూ సమస్య పరిష్కారమయ్యే వరకు ఎవరు పొలాల్లో దిగినా అడ్డుకుంటామని చెప్పారు. ఎవరూ దిగకుండా ఆదేశాలు జారీ చేయాలని జేసీని కోరారు. దీంతో రైతులు వాగ్వాదానికి దిగారు. పోలీసుల జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు.

డబ్బుతో అక్రమ పట్టాలు సృష్టించుకున్నారు..

చింతలపాళెం రెవెన్యూలో 1971లో మరాఠీపురానికి చెందిన 112 షికారీల కుటుంబాలకు 560ఎకరాలను అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇందిరా గాంధీ ప్రధానమంత్రి హయాంలో కేటాయించింది. 2003లో షికారీలు బతుకుదెరువు, వ్యాపారం చేసుకోవడానికి వలస కూలీలుగా వెళ్లాం. ఇదే అదనుగా భావించిన చింతలపాళెం, వెంకటాపాళెం, రామానుజపల్లెకు చెందిన పలువురు భూస్వాములు సదరు భూములపై కన్నేసి డబ్బుతో అధికారులను కొనుగోలు చేసి అక్రమ పట్టాలు పొందారు. వీటిపై పోరాటం చేస్తున్నాం. భూస్వాముల చేతిలో ఉన్న భూములను అందించండి.

- షికారీల ఉద్యమ నేత దబ్బా పరశునాథ్

1992లోనే ప్రభుత్వం పట్టాలిచ్చింది

1992లో అప్పటి ప్రభుత్వం మూడు గ్రామాల రైతులకు ఒక్కో కుటుంబానికి ఒకటిన్నర ఎకరా చొప్పున అందించింది. చింతలపాళెం రెవెన్యూ అటవీ ప్రాంతంగా పొదలుపొదలుగా ఉన్న భూములను గుర్తించి 1992లో అప్పటి ప్రభుత్వం పట్టాలిచ్చింది. ఆ భూములను తాకట్టు పెట్టి బ్యాంకులో రుణాలు కూడా పొంది ఉన్నాం. రైతులందరూ లక్షల రూపాయలు ఖర్చు చేసి బోర్లు ఏర్పాటు చేసుకుని ప్రస్తుతం పంటలు పండిస్తున్నాం. రైతుల పంటలు వేసుకోవడానికి పొలాల వద్దకు వెళితే షికారీలు అడ్డుకుంటున్నారు.

- ఈగల సుబ్రహ్మణ్యం, రైతు, చింతలపాళెం

బ్రెస్ట్ క్యాన్సర్ హెల్ప్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

తిరుపతి కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్య సంరక్షణ కోసం బ్రెస్ట్ క్యాన్సర్ హెల్ప్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుని తద్వారా మరింత అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మహిళలలో బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు సంబంధించి స్వీయ పరీక్ష పోస్టర్‌ని మంగళవారం కలెక్టరేట్‌లో ఆరోగ్యశాఖ, పరివర్తన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారు స్వీయ పరీక్ష చేసుకుని సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత పరీక్షలతోపాటు చికిత్స పొందాలని తెలిపారు. సి.హేయ్, పరివర్తన సంస్థల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

ఇసుక తనిఖీ కేంద్రం ప్రారంభం


సురుటుపల్లె వద్ద ఇసుక తనిఖీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ

నాగలాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమల్లోకి తీసుకు వచ్చిన నేపథ్యంలో స్థానిక అవసరాలకు వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా ఇసుక రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్లకుండా పోలీసులు డేగ కన్ను వేశారు. మంగళవారం నాగలాపురం మండలంలోని సురుటుపల్లి వద్ద ఇసుక తనిఖీ కేంద్రాన్ని పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... ఈ తనిఖీ కేంద్రం వద్ద నాగలాపురం ఎస్ఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో 12మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. వీరు తనిఖీ కేంద్రం వద్ద 24 గంటల పాటు అందుబాటులో ఉండి ఇసుక అక్రమంగా తరలిపోకుండా చర్యలు తీసుకుంటారన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే కేసు నమోదు చేస్తామన్నారు. అలాగే ఇసుక డంపులు ఎక్కడైనా ఉన్నా, తమిళనాడుకు తరలిపోతున్నట్లు తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు సీఐ మురళీ నాయుడు, నాగలాపురం ఎస్ఐ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పంటల బీమా తప్పనిసరి


శేషంపేట వరి పొలాల్లో వ్యవసాయ అధికారులు

పిచ్చాటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు పంటల బీమా తప్పని చేసుకుంటేనే నష్టపరిహారం అందుతుందని వ్యవసాయ అధికారి సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం శేషంపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట బీమా చేసుకోవడానికి డిసెంబరు 30 ఆఖరి తేదీ అన్నారు. పంట బీమాకు వన్ బీ, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నెంబరు, బ్యాంకు అకౌంటుకు లింకైన సెల్ నెంబరు, పంట నమోదు సర్టిఫికెట్ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏడీ సుబ్రహ్మణ్యం, పశుసంవర్థకశాఖ మంజుల, రైతులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.14 కోట్లు

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.14 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది.

రోడ్డు కోసం రెండు వర్గాల ఘర్షణ

డీఎస్పీ విచారణ


రోడ్డును పరిశీలిస్తున్న డీఎస్పీ

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేణుగోపాలపురం పంచాయతీలోని కమ్మవారికండ్రిగలో పొలాలకు వెళ్లే రోడ్డు విషయమై రెండు వర్గాలపై కేసు నమోదు చేయడం కోసం శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి గ్రామంలో విచారణ చేపట్టారు. కమ్మవారికండ్రిగకు చెందిన మనోహర్ నాయుడు, మధునాయుడు, కారణిమిట్ట దళితవాడకు చెందిన రమేష్, వెంకటేష్, ఇదే గ్రామానికి చెందిన మరో వర్గం ప్రసాద్ నాయుడు, భువనేశ్వరి పొలాలకు పోయే రోడ్డు కోసం ఘర్షణ పడ్డారు. దీంతో రెండు వర్గాలు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాయి. ప్రసాద్‌నాయుడు, భువనేశ్వరికి గాయాలవడంతో మనోహర్‌నాయుడు, మధునాయుడు, రమేష్, వెంకటేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. రమేష్‌ను కులం పేరుతో దూషించారంటూ ప్రసాద్‌నాయుడిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం డీఎస్పీ సిబ్బందితో పొలాలకు వెళ్లే దారిని పరిశీలించి గ్రామస్తులను విచారించారు. ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ క్యూలైన్ల తనిఖీ



శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముక్కంటి ఆలయంలో క్యూలైన్లను ఈవో బాపిరెడ్డి మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆలయంలో భక్తుల కోసం వివిధ రకాల క్యూలైన్లు ఉన్నాయి. ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసి భక్తులు వెళ్లే లైన్లను పరిశీలించారు. టిక్కెట్ల నిర్వహణపై ఆరా తీశారు. అలాగే ఆర్జిత సేవ టిక్కెట్లు జారీ చేసే కౌంటర్లను తనిఖీ చేశారు. అనంతరం మహాద్వారం వద్ద భక్తుల సౌకర్యాలపై అక్కడి సిబ్బందితో మాట్లాడారు.

అభివృద్ధి పనులను నాణ్యంగా చేపట్టాలి

సత్యవేడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంజూరైన వివిధ అభివృద్ధి పనులను నాణ్యంగా చేపట్టాలని పీఆర్ డీఈ గోపి స్పష్టం చేశారు. ఎంపీడీవో కార్యాల యంలోని మీటింగ్ హాల్‌లో మంగళవారం సెక్రటరీలు, ఇంజ నీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. మండలంలో ఉపాధి హామీ పథకం కింద రూ.2కోట్లకు సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువ పనులు మంజూర య్యాయన్నారు. ఈ పనులకు అవసరమైన ఇసుకను నాగలాపురం మండలం నందనం రీచ్ నుంచి ఉచితంగా తరలించుకోవచ్చని జిల్లా అధికారులు అనుమతులు ఇచ్చారన్నారు. ఇసుక రవాణా కోసం ట్రాక్టర్లకు సంబంధిత ఇంజ నీరింగ్ అసిస్టెంట్ల సిఫార్సుతో పంచాయతీ అను మతి పత్రాలను ఇవ్వాలన్నారు. ఇసుక తరలి స్తున్న ట్రాక్టర్లకు పనులకు సంబంధించిన వివ రాల బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు.

జిల్లా సభలను జయప్రదం చేయండి: సీపీఎం


సమావేశంలో మాట్లాడుతున్న వందవాసి నాగరాజు

సత్యవేడు, నవంబరు 5: పట్టణంలో డిసెంబరు 1, 2 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విరివిగా వస్తాయని ఆశించిన యువతకు నిరాశే మిగిలిందని వాపోయారు. రాష్ట్రంలో రోజురోజుకు మహిళలు, పిల్లలపై అత్యాచారాలు, దళితులపై దాడులు పెరుతున్నా ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తోందని విమర్శించారు. ఈ నెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ప్రజాపోరులో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్దన్, కార్యదర్శులు రమేష్, నాగరాజు, మురుగేష్, రామచంద్రారెడ్డి, ధనుంజయులు, రమణయ్య, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు మురళి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్ రెడ్డి

వరదయ్యపాళెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో మంగళవారం నియోజకవర్గ ఆశా వర్కర్ల యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆశా వర్కర్లకు నెలకు రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని, రికార్డులను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని, డీఎంహెచ్‌ఓ సంతకంతో గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఏడాదికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, టీఏ, డీఏలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చంద్రబాబు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు వాణి, రెడ్డిలత, వళర్మది, సుకన్య, జ్యోతి, పుష్పలత, రేఖ, కుముద, వెంకటమ్మ, వల్లియమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేదీప్యం ఆకాశ దీపం



శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆకాశదీపం దేదీప్యమానంగా ప్రకాశించింది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలోని పగడ చెట్టు వద్ద మంగళవారం సాయంత్రం ప్రదోష వేళలో ఆకాశదీపం ఎగురవేశారు. అంతకుముందు ఆలయ అర్చకులు విశేష పూజలు చేశారు. అనంతరం హారతులు సమర్పించి భక్తుల శివనామ స్మరణ మధ్య ఆకాశ దీపాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ హేమమాలిని తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

వరదయ్యపాళెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో ఓ పూరిల్లు దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని కళత్తూరు అరుంధతీ వాడలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన మునీంద్రయ్య మంగళవారం ఉదయం కూలీ పనులకు వెళ్లాడు. అతని భార్య నాగుల చవితి సందర్భంగా పుట్టవద్దకు వెళ్ళింది. తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి పైకప్పు నుంచి మంటలు రావడం గమనించి ఇరుగు పొరుగు సాయంతో అతి కష్టం మీద మంటలను ఆర్పారు. ఈ ఘటనలో ఇంట్లో సామగ్రితో పాటు. పలు విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. రెండు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన తొట్టంబేడు మండలం లింగంనాయుడు పల్లి వద్ద పూతలపట్టు - రేణిగుంట జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగింది. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికుల గుర్తించి తొట్టంబేడు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ ఈశ్వరయ్య సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు కోసం ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా ఘటనా స్థలంలో పంచనామా చేశారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి విఫల యత్నం

శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దొంగలు ఇంట్లోకి చొరబడి భారీ చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ ఘటన మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలోని దక్షిణ కైలాస నగర్ కాలనీలో వెలుగు చూసింది. ఈ కాలనీకి చెందిన కృష్ణవేణి గృహిణి. ఇటీవల అమెరికాలో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగలు లోపలికి చొరబడి వస్తువులను చిందరవందర చేశారు. అయితే మహిళ ముందు జాగ్రత్తతో విలువైన ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్‌లో భద్రపరిచి వెళ్లడంతో భారీ నష్టం తప్పింది. ఇంట్లో ఉన్న రూ.10 వేల నగదు మాత్రం చోరీ జరిగింది. దీనిపై పోలీసులకు ఎలాంటి పిర్యాదు అందలేదు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

రేణిగుంట నవంబరు 5,(ఆంధ్రజ్యోతి): కట్ట పుట్టలమ్మ ఆలయానికి విచ్చేసే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ చెప్పారు. మంగళవారం కరకంబాడి పంచాయతీలోని కట్ట పుట్టాలమ్మ ఆలయ చైర్మన్‌గా టీడీపీ నాయకుడు పాడి రాజేంద్ర, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు.

రోజా... నోరు అదుపులో ఉంచుకో!

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి హెచ్చరిక ● ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సుధీర్



రేణిగుంట, నవంబర్ 5(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రోజా నోరు అదుపులో ఉంచుకోలేకపోతే తాట తీస్తానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం రేణిగుంట ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రజా దర్బారులో మండలవ్యాప్తంగా భారీ ఎత్తున ప్రజలు తమ సమస్యలను తెలిపేందుకు పోటెత్తారు. దీంతో ఎమ్మెల్యే స్వయానా హౌసింగ్ శాఖకు సంబంధించి ఓ అధికారిని పురమాయించారు. కబ్జాలు, పోలీస్ సమస్యలుంటే తనకు ఇవ్వాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... మాజీ మంత్రి రోజా నోరు అదుపులో ఉంచుకోవాలని లేనిపక్షంలో తాట తీస్తామని హెచ్చరించారు. తమ నాయకులు చంద్రబాబు, లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్‌పై నోరు పారేసుకుంటే టీడీపీ కార్యకర్తలు రేపు రోజాని ఏమి చేసినా తమకు సంబంధం లేదని హెచ్చరించారు. ఇక రేణిగుంట మండలంపై ప్రత్యేక దృష్టి సారించి మురుగు కాలువలు, రోడ్ల నిర్మాణానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అలాగే స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రేణిగుంట, ఏర్పేడు మండలాల విద్యార్థులకు డిగ్రీ కాలేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. స్థానిక కంపెనీలతో మాట్లాడి మండల వ్యాప్తంగా ఆయా పంచాయతీల్లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తామన్నారు. మండల ప్రజలకు అనువుగా టీటీడీ నిధులతో కల్యాణ మండపం, అలాగే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. ముఖ్యంగా ప్రజా దర్బారులో మహిళలు తమకు పట్టాలు ఇచ్చి స్థలం చూపించలేదని ఫిర్యాదులు అందాయని ఈ విషయంపై తహసీల్దార్‌తో విచారణ చేపట్టి వాస్తమని తెలిస్తే మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిపై పోలీస్ కేసు నమోదు చేయిస్తానన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి మండల సర్వసభ్య సమావేశం కావడంతో మండలంలోని ప్రజలు భారీగా హాజరై అర్జీలు అందించడం చూస్తుంటే గత వైసీపీ పాలనకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. గత ప్రభుత్వంలో లాగా వచ్చామా... వెళ్లామా... తరహాలో విధులు నిర్వహిస్తే సహించేది లేదని ఉద్యోగులను హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి ప్రణాళికబద్ధంగా పరిష్కరించేందుకు వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తన పేరు, తన పీఏ పేరు చెప్పి పనిచేయాలని ఒత్తిడి తెస్తే నేరుగా తనకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొత్తూరు హరిప్రసాద్ రెడ్డి, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా నాగుల చవితి




నాగశిలలకు పూజలు చేస్తున్న కరుణాకర్ గురుకుల్ - హరహర బావి వీధిలో పూజలు - సత్యవేడులో నాగాలమ్మ ఆలయం వద్ద భక్తులు

శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినం శ్రీకాళహస్తిలో వేడుకగా జరిగింది. ఇందులో భాగంగా ముక్కంటి ఆలయ తిరుమంజనం గోపురం రుద్రపాదాల వద్ద విశేష పూజలు నిర్వహించారు. రుద్రపాదాలు, శివలింగాన్ని పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకించారు. అలాగే నాగశిలలకు విశేష అభిషేకాలు చేసి పూలతో అలంకరించారు. ఆ తర్వాత మంత్ర పుష్పం, నైవేద్యం, హారతులు సమర్పించారు. భక్తులు మొలకెత్తిన సజ్జలు, నువ్వుల పిండి, బెల్లం నానబెట్టిన బియ్యం తదితరాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకాళహస్తి పట్టణం, మండలం, తొట్టంబేడు మండలంలో పుట్టలకు పాలు, గుడ్లు, పిండి వంటలను నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు.

నారాయణవనం: మండలంలో నాగుల చవితిని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దీపావళి తరువాత నాలుగో రోజున నాగుల చవితి జరుపుకుంటారు. పుట్టలకు పసుపు, కుంకుమలతో పూజించి నైవేద్యాలు సమర్పించారు. పరాశరేశ్వర స్వామి ఆలయం, అవనాక్షమ్మ ఆలయం, తుంబూరు శివాలయంలో, కైలాసనాథ కోనలో, పాలమంగళం నార్త్, పద్మసరస్సు, కీళగరం చెరువు కట్టపై, ఎల్లమ్మ ఆలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో నాగులమ్మకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలకు దారం చుట్టి, పాలాభిషేకం చేశారు.

ఏర్పేడు: మండలంలో నాగులచవితిని ఘనంగా నిర్వహించారు. బియ్యపుపిండి చలిమిడి, నువ్వులు, మొలకెత్తిన సజ్జలు, పాలు, గుడ్లతో నాగుల పుట్టల వద్దకు చేరుకుని నాగదేవతలకు నైవేద్యం సమర్పించారు. మండల వ్యాప్తంగా నాగులచవితి సందడి నెలకొంది.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో నాగుల చవితిని మహిళలు మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగేంద్రస్వామికి పూజలు చేశారు. పాముల పుట్టలో పాలు, కోడిగుడ్లు పోశారు.

పిచ్చాటూరు: మండలంలో ఇంటింటా నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పుట్టల వద్దకు చేరుకుని పాలు పోసి కోడిగుడ్లు వదిలారు. పిచ్చాటూరు ఆర్‌ఎంబీ గెస్ట్ హౌస్ వెనుక వైపు ఉన్న నాగాలమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. మహిళలు పుట్టకు కొత్త చీర కప్పి పిండి వంటలను సమర్పించారు.

సత్యవేడు: నాగుల చవితి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని బాలనాగాలమ్మ ఆలయంతో పాటు కుమ్మరి గుంట, ఆర్టీసీ బస్టాండ్, మదనంబేడు, దాసుకుప్పం తదితర ప్రాంతాల్లోని నాగ దేవతల ఆలయాల వద్దకు భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని పుట్టలో పాలు, గుడ్లు పోసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పుట్టలకు కొత్త చీరలు కప్పి, వివిధ రకాల వంటలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కేవీబీపురం: స్థానిక నాగాలమ్మ పుట్ట వద్దకు మహిళా భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. చిరుధాన్యాలు, పిండివంటలతో నాగమ్మ వారికి నైవేద్యం సమర్పించి చల్లంగా దీవించమని వేడుకున్నారు.




బండారుపల్లి అంకమ్మ ఆలయం వద్ద, కీళగరం వద్ద, కేవీబీపురంలో పుట్ట వద్ద పూజలు

ముక్కంటి ఆలయంలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు



శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముక్కంటి ఆలయంలో భక్తుల నుంచి ఫిర్యాదులు, సలహాలు స్వీకరించేందుకు ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటు చేశారు. సుమారు తీవీ ఏళ్ల క్రితం ముక్కంటి ఆలయంలో ఈ విధానం ఉండేది. ప్రస్తుతం తిరిగి మంగళవారం ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద కొత్తగా ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేశారు. తమ సమస్యలను తెలిపేందుకు కొత్త ఈవో బాపిరెడ్డి అవకాశం కల్పించడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హుండీ చోరీ


దొంగలు వదిలి వెళ్ళిన చిల్లర నాణేలు

శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత ఆలయంలో హుండీ చోరీ జరిగింది. ఈ ఘటన మంగళవారం తొట్టంబేడు మండలం చిన్నపర్తి గ్రామంలో వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం మేరకు... వేమాలమ్మ ఆలయంలోని హుండీని సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ధ్వంసం చేశారు. చిల్లర నాణేలను సమీపంలో వదిలి వెళ్లారు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదని తొట్టంబేడు ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు.

ఫారెస్ట్ ప్రొటెక్షన్ కుటుంబానికి ఆర్థిక సాయం



శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫారెస్ట్ ప్రొటెక్షన్ వాచర్ వెంకటేష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం వద్ద జాతీయ రహదారిపై పోలీస్ వాహనాన్ని గ్యాస్ లారీ ఢీకొన్న ఘటనలో వెంకటేష్ మృతి చెందిన విషయం తెలిసిందే. ముందుగా దహన ఖర్చులకు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి అధికారులు అందజేశారు. అనంతరం రెండో దఫా పోలీసు, అటవీ శాఖ ఆధ్వర్యంలో కలిపి మంగళవారం రూ.2.7లక్షలను అందజేసినట్లు శ్రీకాళహస్తి అటవీ శాఖ అధికారి లోకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరసింహమూర్తి సీఐలు గోపి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో యువతి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరుకు చెందిన యువతికి ఇదే మండలంలోని వేడాంకి చెందిన యువకుడితో 2 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ముక్కంటి ఆలయం సమీపంలోని సన్నిధి వీధిలో ఉన్న ఓ రెస్టారెంట్లో యువతి పనిచేస్తుంది. సోమవారం రాత్రి ఫోన్లో భర్తతో వాగ్వాదం జరిగింది. అనంతరం కాసేపటి తర్వాత బీపీ అగ్రహారం ప్రాంతం నుంచి తాను పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులకు తెలిపింది. హుటాహుటిన బంధువులు అక్కడికి చేరుకుని ఆమెను ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

ట్రాఫిక్ ఆంక్షలపై అలసత్వం తగదు

శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఆంక్షలపై అలసత్వం తగదని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి సూచించారు. మంగళవారం ఆర్టీసీ కూడలి నుంచి పట్టణ ప్రధాన చతుర్మాడ వీధుల వరకు ఆయన నడిచి తిరిగారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి విధించిన ఆంక్షలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు. వన్ వే, నో పార్కింగ్, వన్ సైడ్ పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. నిబంధనలు పాటించని వ్యాపారులకు సూచనలు చేశారు.

బీఆర్‌నాయుడికి ఘనస్వాగతం



రేణిగుంట నవంబర్ 5,(ఆంధ్రజ్యోతి): కాబోయే టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి తిరుపతి విమానాశ్రయంలో మంగళవారం ఉదయం ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, శ్రీకాళహస్తి, చంద్రగిరి, తిరుపతి ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి వినుత, డాలర్స్ దివాకర్ రెడ్డి, స్థానిక కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన పెనుమూరు సమీపంలోని స్వగ్రామానికి వెళ్లారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డికి తిరుపతి విమానాశ్రయంలో తిరుపతి పార్లమెంటు టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు కె.హేమంత్ రాయల్, తిరుపతి పార్లమెంట్ తెలుగుయువత అధ్యక్షుడు ఎ.కృష్ణయాదవ్ ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్, జానకిరామ్, చంటి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి విద్యార్థికి స్కౌట్స్ అండ్ గైడ్స్ రాజ్య పురస్కార్ అవార్డు



శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన స్కౌట్ విద్యార్థి శ్రీనివాసులు రాజ్య పురస్కార్ అవార్డుకు ఎంపిక అయ్యాడు. బాబు అగ్రహారం పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న సాలపాక్షి శ్రీనివాసులు భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో చురుగ్గా వ్యవహరిస్తుంటారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ అవతరణ దినోత్సవంలో భాగంగా గుంటూరులోని తాడికొండ రాష్ట్ర శిక్షణ కేంద్రంలో రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంప్‌లో ఉత్తీర్ణత సాధించాడు. రాష్ట్రస్థాయిలో 10మంది రాజ్య పరిష్కార్‌కు ఎంపికయ్యారు. ఈనెల 7న విజయవాడలోని రాజ్ భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శన



శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన సహస్ర ఆర్ట్స్ నేషనల్ అకాడమీ బృందం దేవజ్ఞ, భవిష్య ప్రదర్శించిన ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు సభికులను అబ్బురపరిచాయి. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ముక్కంటి ఆలయ ఆవరణలో మంగళవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కళాకారులను ముక్కంటి ఆలయ అధికారులు సత్కరించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, తానంకి నానాజీ

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందుకున్న వారు కూటమి ప్రభుత్వం పట్ల కృతజ్ఞత చూపాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధి లోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను, ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధిని నిర్వీర్యం చేసిందన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే నియోజకవర్గ పరిధిలో 9మందికి రూ.10.63 లక్షల ఆర్థిక సాయాన్ని అందించామని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గ పరిధిలో పలువురికి రూ.9కోట్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పెంచలకోన ట్రస్ట్‌బోర్డు మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, నరసింహులు నాయుడు, ఇశ్రాయిల్ కుమార్, భాస్కర్‌రెడ్డి, కోటేశ్వరరావు, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునేందుకు సుధా అనే మహిళకు మూడు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఆర్‌డీ సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, ఏపీఆర్‌డీ రాష్ట్ర కోఆర్డినేటర్ శిల్పా ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

చియాంగ్ మై వర్సిటీతో ఆదిశంకర ఎంవోయూ

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): థాయ్‌లాండ్‌లోని చియాంగ్ మై వర్సిటీతో స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాల ఛైర్మన్ డాక్టర్ పెంచలయ్య థాయ్‌లాండ్ వెళ్లి చియాంగ్ మై వర్సిటీ ప్రతినిధులతో చర్చించారు. శాస్త్ర, సాంకేతిక అంశాల్లో పరిశోధన, విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తదితర అంశాల్లో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు పెంచలయ్య తెలిపారు. అంతర్జాతీయ ప్రయాణాలు కలిగిన చియాంగ్ మై వర్సిటీతో ఒప్పందం వల్ల ఆదిశంకర విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక అంశాల్లో పరిశోధనకు ఎంతో ఉపకరిస్తుందన్నారు.

నెల్లూరుపల్లి కొత్తపాళెంలో గ్రామసభ

కోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి, కొత్తపాళెం, విశ్వనాథపురం అగ్రహారం గ్రామాల్లో భూముల రీసర్వేపై మంగళవారం తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. భూ సమస్యలపై రైతులు అర్జీలు ఇచ్చారు. రీ సర్వేలో పొరపాట్లను అధికారులు పరిష్కరించారు.

వైసీపీకి పూర్వ వైభవం తీసుకొస్తాం: రాంకుమార్

వెంకటగిరి టౌన్, నవంబరు 5,(ఆంధ్రజ్యోతి): వైసీపీకి పూర్వ వైభవం తీసుకొస్తామని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమస్యలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు గుర్తించుకుని కార్యకర్తలు, నాయకులను కలుపుకుని పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో వైసీసీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

నాయుడుపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలోని కట్టకాలనీ వద్ద లక్ష్మీప్రియ(18) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. కట్టకాలనీలో నివసిస్తున్న లక్ష్మీప్రియ కొంతకాలంగా ఓ సూపర్ మార్కెట్‌లో పనిచేస్తోంది. నాలుగు రోజుల క్రితం సూపర్‌మార్కెట్‌లో నగదు తేడా రావడంతో లక్ష్మీప్రియ తీసుకుందని నిందించారు. ఆమె తల్లిదండ్రులు సూపర్‌మార్కెట్ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. కాగా, మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని లక్ష్మీప్రియ మృతి చెంది ఉండడాన్ని తల్లిదండ్రులు గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

84 మద్యం బాటిళ్ల స్వాధీనం

నాయుడుపేట టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎక్సైజ్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 84మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారి సత్యనారాయణ తెలిపారు. పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడులో మంగళవారం దాడులు నిర్వహించగా అంకమ్మ అనే మహిళ 30 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టణ పరిధిలోని పాత వెంకటగిరి రోడ్డులో విజయమ్మ అనే మహిళ నుంచి 54 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారి తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని మోటరు సైక్లిస్టుకు తీవ్రగాయాలు

నాయుడుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - అన్నమేడు జాతీయ రహదారి సమీపంలో మోటారు సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బిట్రగుంటకు చెందిన ప్రేమ్‌కుమార్ మోటరు సైకిల్‌పై బెంగళూరుకు వెళ్తుండగా నాయుడుపేట సమీపంలోకి ట్రాక్టర్ ఢీ కొందది. తీవ్రంగా గాయపడిన ప్రేమ్‌కుమార్‌ను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవలకై నెల్లూరుకు తీసుకెళ్లారు.

మినీ గోకులాలకు భూమిపూజ

కోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడు పంచాయతీలో మినీ గోకులానికి మంగళవారం భూమిపూజ జరిగింది. టీడీపీ నాయకులు రఘురామయ్య, కృష్ణ, శ్రీనివాసులు, పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్, టెక్నికల్ అసిస్టెంట్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భూమిపూజ చేసి మినీ గోకులాల పనులను ప్రారంభించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

స్వర్ణముఖి నదిలో నీటమునిగి పదో తరగతి విద్యార్థి మృతి



విద్యార్థి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ చిన్నబలరామయ్య



వీరేందర్ సాయి (ఫైల్‌ఫొటో)

చిట్టమూరు, నవంబర్ 5(ఆంధ్రజ్యోతి): సరదాగా ఈతకెళ్లిన విద్యార్థి నీట మునిగి మృత్యువాత పడిన ఘటన చిట్టమూరు మండలంలో సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కోట మండలం, విద్యానగర్ ప్రకాష్ కాలనీకి చెందిన సాయి, రాధా దంపతుల కుమారుడు వీరేందర్ సాయి(15) చిట్టమూరు మండలం మెట్టు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత తోటి విద్యార్థులు అంకయ్య, వంశీ, అప్పీతో కలిసి వీరేందర్ సాయి మెట్టు సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. వీరేందర్ సాయి, వంశీ ఇసుక ఊబిలో మునిగిపోతుండడంతో అంకయ్య అప్రమత్తమై వంశీని గట్టుకు లాకొచ్చాడు. ఇంతలో వీరేందర్ సాయి నీట మునిగిపోయాడు. దీంతో భయపడిన అంకయ్య, వంశీ, అప్పీ అక్కడ నుంచి వెళ్లిపోతూ వీరేందర్ సాయి బట్టలను ఇసుకలో పాతి పెట్టారు. పుస్తకాల బ్యాగ్‌ను ఊరిబయట కంప చెట్లలో పడేశారు. చీకటి పడుతున్నా కుమారుడు ఇంటికి రాకపోవడంతో వీరేందర్ సాయి తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆరా తీసినప్పటికీ విద్యార్థులు ఎవరూ చెప్పలేదు. మంగళవారం ఉదయం వీరేందర్ సాయి తల్లిదండ్రులు ముగ్గురు విద్యార్థులనూ బతిమలాడగా జరిగిన సంఘటన గురించి వంశీ వివరించాడు. ఈతకు వెళ్లిన చోట గాలించగా వీరేందర్ సాయి మృతదేహం లభ్యమైంది. పోలీసులు సమాచారం ఇవ్వగా ఎస్ఐ చిన్న బలరామయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వీరేందర్ సాయి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ఇసుక గోతులే విద్యార్థి ప్రాణం తీశాయ్

గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక దోపిడీకి ఆనవాళ్లుగా మిగిలిన గోతులే విద్యార్థి ప్రాణాలను బలిగొన్నాయని మెట్టు గ్రామస్తులు ఆరోపించారు. స్వర్ణముఖి నదిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాల వల్ల ఏర్పడిన గోతుల్లో వీరేందర్ సాయి ఇరుక్కుపోవడం వల్లే మృత్యువాత పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు.

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే

స్వర్ణముఖిలో ఈతకెళ్లిన విద్యార్థి వీరేందర్ సాయి మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వీరేందర్ సాయి కుటుంబానికి ఎమ్మెల్యే రూ.పది వేల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు టీడీపీ నేతలు శ్రీనివాసులురెడ్డి, శ్రావణ్ తెలిపారు.

విపత్కర పరిస్థితుల్లో ధైర్యం కోల్పోవద్దు



మనిషిపై చెట్టుకూలిపోయిన సమయంలో తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందం

తడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుఫాన్లు, సునామీల వంటి విపత్కర పరిస్థితుల్లో ధైర్యం కోల్పోకూడదని, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ప్రమాదాల నుంచి ఎలా బయటపడాలో ఆలోచించాలని తహసీల్దారు శరత్‌బాబు అన్నారు. మంగళవారం భీములవారిపాళెం సచివాలయం వద్ద ఎస్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో సునామీపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. తహసీల్దారు శరత్‌బాబు మాట్లాడుతూ తుఫాన్లు, సునామీ వంటి విపత్కర పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మాక్‌డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి 9వ బెటాలియన్ ఎస్‌డీఆర్ఎఫ్ ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపీడీవో విజయకుమార్, ఎంఈవో మల్లికార్జున, గృహ నిర్మాణశాఖ ఏఈ సత్యనారాయణ, అటవీశాఖ రేంజర్ సౌజన్య, సర్పంచు గీతాప్రకాష్, టీడీపీ నాయకుడు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

తూపిలిపాళెంలో సునామీపై మాక్‌డ్రిల్

వాకాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుపిలిపాళెంలో మంగళవారం తహసీల్దారు రామయ్య ఆధ్వర్యంలో సునామీపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. సునామి సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ముందస్తు చర్యలు ఎలా చేపట్టాలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఎస్ఐ నాగబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, పశుసంవర్ధకశాఖ వైద్యులు రమణయ్య, కృష్ణారావు, గ్రామస్థులు వెంకటరమణయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి



చిల్లకూరులో తెలుగుగంగ కార్యాలయం వద్ద పట్టకు పూజలు

గూడూరు, చిల్లకూరు, వెంకటగిరి టౌన్, ఓజిలి, నాయుడుపేట టౌన్, తడ, కోట, సూళ్లూరుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి పర్వదినాన్ని మంగళవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గూడూరు కోర్టు ఆవరణ, విఘ్నేశ్వరపురం ప్రాంతాల్లోని నాగులపుట్ట వద్ద, శివాలయం, కోదండరామాంజనేయస్వామి ఆలయాల్లోని నాగశిలలకు పూజలు చేశారు. ● చిల్లకూరు తెలుగుగంగ కార్యాలయం సమీపంలో ఉన్న పుట్ట, శంకరన్ గిజనకాలనీలోని పుట్ట, సమీప పొలాల్లోని పుట్టల వద్ద పూజలు చేశారు. ● వెంకటగిరి పట్టణంలోని కాశీవిశ్వనాథ స్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయం, కౌవల్యా నది ఒడ్డున ఉన్న నాగ మందిరం పుట్ట వద్ద పూజలు చేసి పాలు పోశారు. ● ఓజిలి, కురుగొండ, మానమాల, వెంకటరెడ్డిపాళెం గ్రామాల సమీపంలోని పుట్టల వద్ద మహిళలు పూజలు చేశారు. ● నాయుడుపేట రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఉన్న పుట్ట, స్వర్ణముఖినది తీరాన, విన్నమాల దగ్గర ఉన్న పుట్టల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. ● తడ మండలంలో గ్రామాల్లోని పుట్టలను పూలతో అలంకరించారు. పాలు, కోడిగుడ్లు, జొన్నలు, సజ్జలు స్వామివారికి నైవేద్యాలుగా సమర్పించారు. ● కోట మండల పరిధిలోని గూడలి, కేశవరం, చిట్టేడు, మద్దాలి, తిన్నెలపూడి, వెంకన్నపాళెం, కోట, విద్యానగర్‌లో మహిళలు నాగుల చవితి పర్వదినాన్ని జరుపుకున్నారు. పుట్టల్లో పాలు, కోడిగుడ్లను వేసి మొక్కులు తీర్చుకున్నారు. ● సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం వద్దనున్న పుట్ట, కేఆర్‌పాలెం వద్దనున్న సాయిబాబా ఆలయం, మన్నారుపోలూరు రోడ్డులో ఉన్న పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

గూడూరు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో నాసా ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థులను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద అభినందించారు. కార్యక్రమంలో మునిగిరీష్, శివకుమార్, జలీల్, శ్రీకాంత్, శ్రీహరి బాబు, హరిబ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

హైవే పనులకు అడ్డంకులు తొలగించండి

పెళ్లకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట 71వ జాతీయ రహదారి నిర్మాణ పనులకు అడ్డంకులు త్వరితిగతిన తొలగించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పెళ్లకూరు మండల రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలంలో జాతీయ రహదారి నిర్మాణ పనులకు సంబంధించి నష్ట పరిహారం చెల్లింపు సమస్యలను త్వరితిగతిన పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా తాళ్వాయిపాడు, చావాలి చిల్లకూరు గ్రామాల్లో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ యువరాజు, ఆర్ఐ సంతోషీబాయి, వీఆర్వోలు రమేష్, వంశీకృష్ణ, సుధాకర్, తేజ, కల్యాణి, మోబీనా, సుమతి తదితరులు పాల్గొన్నారు.

దామానెల్లూరులో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

సూళ్లూరుపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామానెల్లూరులో మంగళవారం స్విమ్స్ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి విశేష స్పందన లభించింది. మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో పేర్నాడు పీహెచ్‌సీ వైద్యాధికారి రమణయ్య, సర్పంచు వి.రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

పోలేరమ్మకు పొంగళ్లు

ఓజిలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్లకనుపూరులో మంగళవారం గ్రామదేవత పోలేరమ్మకు అంబలి పొంగళ్లు పెట్టారు. ఈ నెల 8వ తేదీనుంచి 10వ తేదీ వరకు మూడు రోజులపాటు అమ్మవారికి గ్రామ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తుడు బచ్చల రవీంద్రారెడ్డి తెలిపారు.